తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





# ఈ రహదారికి మోక్షం ఎప్పుడో!

- తుపాను ప్రభావంతో రహదారికి గండి
- ప్రమాదపుటంచున వాహనదారులు



ఓజిలి, జనవరి 3 ప్రభాతవార్త :ప్రమాదపు అంచుల్లో ఆర్‌అండ్‌బి రహదారి. నిర్లక్ష్యపు నీడలో అధికారులు. రహదారి మరమ్మతులపై నీలినీడలు కమ్ముకోవడంతో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని వాహనదారులు ప్రయాణం చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఇటీవల మిచౌంగ్ తుపాను సృష్టించిన బీభత్సానికి ఓజిలి నుంచి నాయుడుపేట వెళ్లే ప్రధాన రహదారి ఆర్‌అండ్‌బి రోడ్డులోని సగభాగం పూర్తిగా దెబ్బతినడంతో పాటు చెరువులోని నీటి అలల తాకిడికి చెరువుకు ప్రమాద ఘంటికలు మోగుతున్నా మరమ్మతుల పనులు కరవయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు రహదారి మరమ్మతులపై తాత్సారం చేస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిచౌంగ్ తుపాను కారణంగా పెద్దచెరువు కట్ట కోతకు గురై తెగిపోయేందుకు సిద్ధంగా ఉండటంతో నామమాత్రంగా ఇసుక బస్తాలు వేసి ఇరిగేషన్ అధికారులు చేతులు దులుపుకున్నారని, శాశ్వత పరిష్కారం చేయడంలో విఫలమయ్యారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పడిన పెద్దచెరువు బలహీనం కారణంగా వర్షాల సమయంలో కొన్ని ప్రాంతాల్లో నీటి ప్రవాహానికి తెగిపోయిన సందర్భాలు చాలానే ఉన్నాయి. పెద్ద చెరువు ఆయకట్టు ద్వారా సుమారు వెయ్యి ఎకరాలకు పైగా సాగు భూములను నీరందించే పెద్ద చెరువు ప్రమాదపు అంచుల్లో ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం పెదనద చెరువు ఆయకట్టుపై అప్పట్లో రవాణా మార్గం కోసం ఆర్‌అండ్‌బి రహదారిని ఏర్పాటు చేశారు. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు తిరగమే కాకుండా మండల కేంద్రం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. మిచౌంగ్ తుపాను కారణంగా ఆర్‌అండ్‌బి రహదారి సగభాగం వరద తాకిడికి కొట్టుకుపోయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు సంబంధిత అధికారులు రహదారి మరమ్మతుల పట్ల నిర్లక్ష్యపు ధోరణి అనుసరిస్తున్నారని వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి మరమ్మతులను త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# కలెక్టరేట్ ఎదుట రణరంగం

- అంగన్‌వాడీలు పోలీసుల మధ్య యుద్ధం - ఉద్రిక్తతగా మారిన కలెక్టరేట్ ముట్టడి



అంగన్‌వాడీల కలెక్టరేట్ ముట్టడిని అడ్డగిస్తున్న పోలీసులు

చిత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి రణరంగం తలపించింది. అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ ముట్టడి తో కలెక్టరేట్ దద్దరిల్లింది. అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్‌లోకి వెళ్ళకుండా పోలీసులు బ్యారికేడ్లు ఏర్పాటు చేసినా ఫలితం లేకపో యింది. బ్యారికేడ్లను తోసుకొని అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్‌లోకి చొచ్చుకు వెళ్ళడానికి ప్రయత్నించడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. సమస్యల పరిష్కారం డిమాండ్‌తో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన పోరాటం 23 రోజులకు చేరుకోవడంతో సిఐటియు, ఎఐటియుసిల ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. కలెక్టరేట్ ముట్టడికి చిత్తూరు పరిసర ప్రాంతాల నుండి భారీగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తరలి రావడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు లలిత, రాష్ట్ర సిఐటియు కార్యదర్శి ఆర్‌వి నరసింహులు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు తెలంగాణ రాష్ట్రం కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ జీతం ఇస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట అమలు చేసి సిఎం హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యరక్తలు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని న్యాయపరమైన కోర్కెలను తీర్చడానికి ప్రభుత్వం దిగిరావాలన్నారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాల్సిన మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని వారు ధ్వజమెత్తారు. ఈ ముట్టడి కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి విఆర్ జ్యోతి, సిఐటియు నాయకులు గంగరాజు, గిరిధర్‌గుప్తా, ఓబుల్‌రాజు, భువనేశ్వరీ, ఎఐటియుసి నాయకులు ప్రభావతి, చంద్ర, రమాదేవి, షకీలా, మమత, శ్యామల, సరళ, పుణ్యవతి, పంచవర్ణ, అనిత, భారతి, భారీ ఎత్తున అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ఇవ్వకుండా...

# ఎమ్మెల్యే ఆనం ప్రజలను ఇబ్బంది పెట్టారు

**వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి**



ప్రజలకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న రాంకుమార్‌రెడ్డి

వెంకటగిరి, జనవరి 3 ప్రభాతవార్త: నియోజకవర్గంలో అర్హులైన వారికి గత ఎమ్మెల్యే ఆనం రామనారెడ్డి సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం 15, 16 వార్డు గొల్లపాళెం, అరవ బ్రాహ్మణ వీధులలో ఆయన మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనేక మంది అర్హులున్న వారికి సిఎం జగన్మోహన్ రెడ్డి అందించే సంక్షేమ పథకాలు ఇవ్వకుండా అనర్హులకు ఇచ్చారని ఆరోపించారు. అర్హులైన వారందరికీ తాను న్యాయం చేస్తానని తెలిపారు. అడక్కుండానే వరాలు ఇచ్చే దేవుడు సిఎం జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. మేనిఫెస్టోలో లేని పథకాలను కూడా ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు చెప్పారు. పేదల సంతోషంగా ఉండాలని సిఎం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్షాలు ఎన్నో ఏకమైన రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో వైసిపి విజయం సాధిస్తుందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని సిఎం నెరవేర్చినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వాన్ని మరల అందరూ ఆదరించాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను సిఎం జగన్మోహన్ రెడ్డి నేరుగా ఖాతాల్లోకి జమ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సిఎం జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడ అమలు కావడం లేదన్నారు. పేదలు ఆనందంగా జీవించాలని సిఎం నవరత్నాల పథకం పేరుతో విరివిగా సంక్షేమ పడుతున్నట్లు స్థానికులు తెలపగా సమస్య పరిష్కరిస్తామన్నారు. మీ తల్లిదండ్రులు చేసిన అభివృద్ధి వల్ల తాము ఆనందంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ దొంతు శారద, వైసిపి జిల్లా కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, గోపాలకృష్ణ, సుబ్బారావు, నారాయణ, కళ్యాణి, పూజారి లక్ష్మి, నాయకులు, మురళీకృష్ణ, దంతు బాలకృష్ణ పాల్గొన్నారు.

# చెరువులో అక్రమ ఇటుకబట్టీలను అరికట్టాలి



బొగ్గు రవాణాను అడ్డుకుంటున్న గ్రామస్థులు

కోట, జనవరి 3 ప్రభాతవార్త: మండలంలోని కోట కొత్త చెరువు తిమ్మానాయుడు పాలెంలో అనధికారికంగా ఇటుక బట్టీల వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. ఆ క్రమంలో బుధవారం ఓ టిప్పర్‌లో బొగ్గును లోడు చేస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా అధికారులకు చెప్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చెరువులో ఇటుకబట్టీల వల్ల గ్రామమంతా పొగతో రాత్రి సమయాల్లో అన్నం తినలేకపోతున్నామని, కళ్లలో దుమ్మధూళి పడుతుందని వాపోయారు. పాఠశాలకు 10 మీటర్ల దూరంలోనే ఇటుకబట్టీలు కాల్చడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశామని చెప్పారు. ఈ ప్రభుత్వంలో ఎన్ని అర్జీలిచ్చినా, ఎంతమంది అధికారులకు తెలియజేసినా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ ప్రజల సమస్యలు అర్థం చేసుకొని అక్రమ ఇటుక బట్టీలను అరికట్టాలని కోరుతున్నారు.

# వైకాపాలో సొంతింటి కుంపటిలో రగులుతున్న సెగలు!

## సత్యవేడు టికెట్ ఆదిమూలంకు దక్కేనా..?



సత్యవేడు, ప్రభాతవార్త ప్రతినిధి

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి శరవేగం గా సమీకరణలు చేస్తూ ముఖ్య నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఈక్రమంలో తిరుపతి జిల్లాలో చంద్ర గిరి, తిరుపతి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల వివరాలను వెల్లడించారు. ఐప్యాక్ సర్వేల ఫలితంగా ఎమ్మెల్యే పని తీరును బట్టి అవకాశం కల్పిస్తున్నామని చెపుతూనే, పనితీరు బాగోలేకపోయిన మరోసారి అవకాశం పొందిన అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడంలో చురుకైన పాత్ర పోషించాలనని అధిష్టానం సూచించినట్లు తెలుస్తుంది. సత్యవేడు స్థానంలో పోటీచేయనున్న అభ్యర్థి వివరాలను వైకాపా అధిష్టానం వెల్లడించలేదు. ఈక్రమంలో సీటు దక్కని ఎమ్మెల్యేలను సిఎం జగన్ బుజ్జగించే పనిలో పడ్డారట. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తగినవిధంగా న్యాయం చేస్తామని, పార్టీ విజయానికి కలిసి పనిచేయాలని కోరుతున్నట్లు సమాచారం. అయితే సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంకు సొంతింటి కుంపటి సెగలు అధిష్టానం వరకు చేరడంతో ఈసారి టిక్కెట్టు సందేహమేనని తెలుస్తుంది.

**గెలిచినప్పటి నుండే ఇంటి చుట్టు నాకాబంధీ :**

ఎమ్మెల్యేగా ఆదిమూలం గెలిచినప్పటి నుంచి ఇంటి వద్ద నాకాబంధీని ఏర్పాటు చేసుకున్నారు. ఆది మూలంను కలవాలంటే నాయకులకు, ప్రజలకు కష్టతరమైన పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గ నాయకు లు గానీ, ప్రజలు, అధికారులు ఎమ్మెల్యేను కలవాలంటే మొదటి ఆయన కుమారుడు నారాయనవనం జడ్పీటీసి సుమన్‌ను ప్రసన్నం చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ఎమ్మెల్యే తనయుడి ప్రవర్తన పార్టీలోనూ తీవ్రవర్గపోరుకు దారితీసినట్లు సమాచారం. ఈక్రమంలో ప్రభుత్వ కార్యక్రమాలను ఎమ్మెల్యే ఆదిమూలం తుచాతప్పక ప్రజల్లోకి తీసుకుని పోతున్నప్పటికి చెడ్డ పేరు రాక తప్పలేదు. ఇదిలా ఉంటే సత్యవేడు నియోజకవర్గంలో ఆ ఇద్దరు రెడ్ల మాట తప్పా నాకేం తెలియదని, తనకు ఎందుకు చెడ్డపేరు ఉందని ఆదిమూలం సిఎం జగన్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారట, సీటు దక్కదని బాధ, రెడ్ల పెత్తనం ఓ వైపు, మరోవైపు కుమారుని ప్రవర్తన తీరుతో ఎమ్మెల్యే నలిగిపోతున్నారనే సమాచారం. ఏది ఏమైనా రానున్న ఎన్నికల్లో సత్యవేడుకు కొత్తముఖం పరిచయం చేయాలనే ఆలోచనలో వైకాపా అధిష్టానం ఉన్నట్లు సమాచారం రాగా, ఆదిమూలం మాత్రం తనవంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇక అధినేత జగన్ సత్యవేడు నియోజకవర్గంలో ఎలాంటి రాజకీయ పరిణామాలకు తావిస్తారో వేచి చూడాల్సి ఉంది.

# ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు

- కాపర్ వైర్ల దొంగలించడమే లక్ష్యం



వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్(ఫైల్‌ఫోటో)

పాలసముద్రం, జనవరి 3 ప్రభాతవార్త: మండలంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు పెరుగిపోతున్నాయి. సాయంత్రం వరకు బోరు నీరు తోడి వ్యవసాయ పంట పొలాలకు నీటి సరఫరా చేసిన రైతు తెల్లవారుజాము వెళ్ళి చూస్తే ట్రాన్స్‌ఫార్మర్ తమ పొలాల సమీపంలో వుండాల్సిన ట్రాన్స్‌ఫార్మర్ వుండకపోవడంతో రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరు విలువ అధికంగా వుండటంతో దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు చేసి డబ్బులు ఆర్జిస్తున్నారు. గత వారం రోజుల్లో పాలసముద్రం, నరసింహాపురం, సింహరాజపురం గ్రామాల్లో వ్యవసాయ మోటర్ల కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురి అయ్యాయి. ట్రాన్స్‌కో అధికారులు సైతం దొంగతనానికి గురైన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనం పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసి ఆ పత్రులను ట్రాన్స్‌కో అధికారులకు సమర్పిస్తే కానీ స్పందించని పరిస్థితి నెలకొంది. పోలీసులు ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై సత్వరం కేసులు నమోదు చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. కేసు నమోదు చేస్తే తక్షణం దొంగతనానికి గురైన ట్రాన్స్‌ఫార్మర్ల రికవరీ చూపెట్టాల్సివుండటంతో పోలీసులు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహిండం లేదని రైతుల నుండి ఆరోపణలు వస్తున్నాయి. ట్రాన్స్‌కో అధికారులు సైతం వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనానికి గురి కాకుండా పక్కా ఏర్పాట్లు చేస్తే ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలు జరిగే అవకాశం తక్కువగా వుంటుంది. ఈ విషయంపై ఎస్ఐ ప్రసాద్ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై నిఘా పెట్టామని, రైతులు సైతం పంట పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలను పట్టుకోవడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# వేదాంతపురం గ్రామ పంచాయతీలో భూ బకాసురులు

**- స్వర్ణముఖి నదిని పూడ్చి....పక్కాగా గృహ నిర్మాణాలు - భూ కబ్జాలకు సహకరిస్తున్న రెవెన్యూ యంత్రాంగం**



తిరుపతిరూరల్, జనవరి 3 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ ఉమ్మడి వేదాంతపురం గ్రామ పంచాయతీలో భూ బకాసురులు పేట్రేగిపోతున్నారు. ఖాళీ స్థలం కనబడితే కబ్జా చేసి, అక్రమ నిర్మాణాలు చేసేస్తున్నారు. స్వర్ణముఖి నదీపరివాహక ప్రాంతమే కాకుండా, ఏకం గా స్వర్ణముఖిలోనే పక్కాగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. రెవెన్యూ అధికారుల అండదండలతోనే భూ కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, బహిరంగ విమర్శలు ఉన్నాయి. తిరుపతిరూరల్ మండలంలో దర్జాగా భూ కబ్జాలు, భూ ఆక్రమణ లు రెవెన్యూ యంత్రాంగాన్ని తెలిసే జరుగుతున్నాయని, అక్రమ నిర్మాణాలలో రెవెన్యూ భాగస్వామ్యం ఉందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఉమ్మడి వేదాంతపురం గ్రామ పంచాయతీలో యదేచ్ఛగా స్వర్ణముఖి, చెరువు, చెరువు తట్టు, మఠం భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా.... విషయం తెలిసీ రెవెన్యూ సిబ్బంది ఎలాంటి నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం విచారకరం. వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 390 22ఏ నిషేధిత జాబితలో ఉన్న భూమిలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నా, అక్రమ నిర్మాణదారులతో రెవెన్యూ సిబ్బంది చెయ్యి కలిపి, అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని స్థానికులు గుసగుస లాడుతున్నారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా వేదాంతపురం గ్రామ పంచాయతీలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైతున్నాయని స్థానికులు తెలిపారు.వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధిలోని బాయమ్మ తోట సమీపంలో డికెటి స్థలంలో ప్లాట్స్ విక్రయం మూడు పువ్వులు...ఆరు కాయలుగా కొనసాగుతుంది. అక్రమ రేకుల షెడ్డుల నిర్మాణాలు ఏర్పాటు చేసి, ఇంటి పన్నులు, కరెంట్ మీటరు తీసి ఇచ్చి అక్రమదారులు లక్షలు గడిస్తున్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సి రెవెన్యూ సిబ్బంది అక్రమదారులకు కొమ్ముకాయడంతో బహిరంగంగానే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతున్నారు.

# సూర్యునికన్నా ముందు పెన్షన్ తలుపుతడుతోంది:మంత్రి



వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

నగరి, జనవరి 3 ప్రభాతవార్త: మబ్బులు వచ్చి సూర్యుడు అయినా లేట్‌గా వస్తారేమో కాని, సూర్యుని కంటే ముందుగానే జగనన్న పంపిన పెన్షన్ మీ ఇంటి తలుపు తడుతుందని మంత్రి రోజా అన్నారు. పెన్షన్లు పెంచి రూ.3 వేలు ఇస్తున్న సందర్భంగా బుధవారం నగరి మున్సిపల్ పరిధి బస్టాండ్ ప్రాంగణంలో మున్సిపాలిటీకి సంబంధిత పెన్షన్ల పంపిణీని, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీలో రూరల్ మండల పెన్షన్ పంపిణీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జగనన్న మాటిస్తే దానికి తిరుగులేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచి మాట తప్పడు, మడమ తిప్పడు అని మరోసారి ఆయన నిరూపించుకున్నార న్నారు. జగనన్నకు అవ్వతాతలపై ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. మహానేత వైఎస్ఆర్ పాలనలోనే అర్హులందరికి వితంతు, వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు ఇవ్వడం ప్రారంభమైందన్నారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలపేరుతో అర్హులు సగం మదికి పెన్షన్స్ తీసేశారని విమర్శించారు. దేశంలో కాంగ్రెస్ నుంచి కమ్యూనిస్టుల వరకు బీజేపీ నుంచి టీడీపీ వరకు, ఏపీ నుంచి యూపీ వరకు ఎంతో మంది నాయకులు పాలించారని ఎవరూ రూ.3 వేలు పెన్షన్ ఇవ్వలేదన్నారు.

**చంద్రబాబు పాలనలో చనిపోతేనే నూతన పెన్షన్:**

చంద్రబాబు పాలనలోచనిపోతేనే నూతన పెన్షన్ మంజూరయ్యేదని మంత్రి రోజా అన్నారు.అలా పెన్షన్ ఇవ్వాలన్నా జన్మభూమి కమిటీల సిఫారసు కావాలన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. కుల మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పెన్షన్ అందిస్తున్నామన్నారు. ఎన్నికలు రావడంతో చంద్రబాబు హామీలు గుప్పించడానికి వస్తున్నారని ఆయన హామీలన్నీ నీటిపై రాతలే అని ఆమె ఎద్దేవా చేశారు. ఎన్నికలప్పుడు లెక్కలేనన్ని హామీలు ఇచ్చేసి ఎన్నికలు అయ్యాక బోర్డు తిప్పేయడం ఆయనకు అలవాటే అన్నారు. 2014 ఎన్నికల్లో ఇలాగే ఆయన రాష్ట్ర ప్రజలను ఏమార్చారన్నారు. పంటలను అమెరికాలో అమ్మడానికి ఎయిర్‌పోర్టు కట్టిస్తానని కుప్పంలో చంద్రబాబు హామీ ఇవ్వడం చూస్తుంటే ఈ ఎన్నికల్లో అబద్ధాలు ఏ స్థాయిలో చెప్పదలచుకున్నారో అర్థమవుతుందన్నారు. ఇన్నేళ్లు కుప్పం నుంచి గెలిచి ముఖ్యమంత్రిగా ఉండి ఆ ప్రాంతానికి నీళ్లు ఇవ్వలేని వ్యక్తి, మున్సిపాలిటీగా మార్చలేని వ్యక్తి, డివిజన్ తెప్పించలేని వ్యక్తి ఎయిర్‌పోర్టు తెప్పిస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నియోజకవర్గ పరిధిలో చిత్తూరు జిల్లాకు చెందిన మూడు మండలాలు, ఒక మున్సిపాలిటీకి మాత్రమే 23702 పెన్షన్లు అందిస్తు న్నామన్నారు. రూ.7కోట్లుపెన్షన్ అందిస్తున్నా మన్నారు. గతంలో ఇచ్చేదానికన్నా రెండింతలు ఇస్తున్నామన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, ఎంపీపీ భార్గవి, మున్సిపల్ కమిషనర్ కె.ఎల్.ఎన్.రెడ్డి, ఎంపీడీవో లీలామాధవి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, నగరి మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ అగ్రికల్చర్ ఏడీ మురళి, రూరల్ మండల స్పెషల్ ఆఫీసర్ వెటర్నరీ ఏడీ వాసు, డీఎల్ డీవో బాబు, వైస్ చైర్మన్లు, వైస్ ఎంపీపీలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఆరణికి నోఛాన్స్

**- చిత్తూరు వైకాపా అభ్యర్థిగా ఎంసి విజయానందరెడ్డి!**



చిత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో చిత్తూరు నుండి అధికార వైకాపా అభ్యర్థిగా పోటీ చేయడానికి ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి పేరు ఖరారు అయ్యింది. వైకాపా అధిష్టానం ఒకటిరెండు రోజుల్లో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి పేరును అధికారికంగా ప్రకటించనుంది. చిత్తూరు నుండి వైకాపా అభ్యర్థులుగా పోటీ చేయడానికి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంజి విజయానందరెడ్డిలు పోటీ పడ్డారు. రాష్ట్రంలో ప్రభుత్వం అధికారంలో వుండటంతో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను ప్రతిష్టాత్మకంగా నిర్వహించగా, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి పార్టీ అభ్యర్థిత్వంను లక్ష్యంగా చేసుకొని చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గత నాలుగేళ్ళుగా తన సొంత నిధులతో విస్తృతంగా సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చిత్తూరు నుండి మరోసారి వైకాపా అభ్యర్థిగా పోటీ చేయడానికి సర్వం సిద్ధం చేసుకోవడంతో పాటు పార్టీ అభ్యర్థిత్వం సైతం తనకే వస్తుందని వారం రోజుల క్రితం వరకు నమ్మకంగా వున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో రాయలసీమ జిల్లాల నుండి బలిజ సామాజిక వర్గానికి చెందిన వారిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఒక్కరే ఎమ్మెల్యేగా వుండటంతో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో సైతం కుల సమీకరణ తనకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భావించారు. అయితే ఐప్యాక్ సర్వే ఎంసి విజయానందరెడ్డి వైపు మొగ్గు చూపడంతో పార్టీ అధిష్టానం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి పేరును ఖరారు చేసినట్లు తెలిసింది. వైకాపా అభ్యర్థిత్వం లక్ష్యం చేసుకొని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి నాలుగేళ్ళుగా చిత్తూరులో సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు. ఇటీవల చిత్తూరు మున్సిపాల్టీ, చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల్లోని అన్ని వర్గాలకు చెందిన దంపతులకు ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పురస్కరించుకొని బట్టలు బహుకరిం చారు. చిత్తూరు నగర పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్‌కు దుకాణదారులు, త్రోపుడు బండ్లు, వర్తకులు, మార్కెట్ కూరగాయల వ్యాపారులు చెల్లించాల్సిన ట్యాక్స్‌ను తానే చెల్లించి వారికి ట్యాక్స్ లేకుండా చేశారు. అలాగే చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సైకిల్, మోటర్ సైకిల్ ఫీజులను సైతం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి చెల్లించి ఉచితం చేశారు. ఎవరైనా కష్టమని చెప్పి ఇంటి వద్దకు వెళ్ళి సహాయం ఆర్థిస్తే వారికి తన వంతు సహాయం అందించి ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి మంచి పేరు తెచ్చుకోవడంతో వైకాపా అధిష్టానం చిత్తూరు నుండి పార్టీ అభ్యర్థిగా పోటీ చేయడానికి ఖరారు చేసినట్లు తెలుస్తోంది.

## 22న ఓటర్ల జాబితా విడుదల

– క్షేత్ర స్థాయిలో ఇవిఎంలపై అవగాహన – జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్

**చిత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త:** ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు డిసెంబర్ 9వ తేదీ వరకు వచ్చిన క్లైములకు సంబంధించి ఈ నెల 22వ తేదీన పబ్లికేషన్ వుంటుందని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ అన్నారు. డిఆర్ఓ ఛాంబర్‌లో బుధవారం డిఆర్ఓ రాజశేఖర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పోలింగ్ శాతంను పెంచడానికి క్షేత్ర స్థాయిలో ఇవిఎంలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యే వరకు మార్పులు, చేర్పుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతూ వుంటుందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువు ప్రాముఖ్యమైనదని, ఓటు విలువ తెలియజేసి పోలింగ్ శాతం పెంచడానికి క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఈ నెల 25వ తేదీ ప్రత్యేక అవగాహన కార్యక్రమం వుంటుందన్నారు. ఈ సమావేశంలో అట్లూరి శ్రీనివాసులు(బిజెపి), లోకేష్(ఆమ్ ఆద్మీ పార్టీ), పరదేశీ(కాంగ్రెస్), ఎలక్షన్ సూపరిటెండెంట్ బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలు తనిఖీ

**చిత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త:** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం కమీషనర్ డాక్టర్ జె.అరుణ తనిఖీ చేశారు. ఎలక్షన్ కమీషన్ నిర్ధేశించిన కనీస సౌకర్యాలు పోలింగ్ స్టేషన్లలో వుండాలని కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. కమీషనర్ ఎం.బండపల్లి ప్రాథమిక పాఠశాలలోని 51వ పోలింగ్ కేంద్రంను తనిఖీ చేసిన కమీషనర్ పోలింగ్ కేంద్రంలో నీటి సరఫరా, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, రాంపుల నిర్మాణం, ఫర్నిచర్ సౌకర్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఇ గోమతి, సిఎంఎం గోపి, బిఎల్ఓలు పాల్గొన్నారు.

## వైకాపా నుండి టిడిపిలో చేరిక

**పాలసముద్రం, జనవరి 3 ప్రభాతవార్త:** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రభావశీలుర గుర్తింపు కమిటీ సభ్యులు భీమినేని చిట్టిబాబు ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని సింహరాజపురం గ్రామంలో అధికార వైకాపాకు చెందిన 10 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నాయి. పాలసముద్రం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భీమినేని చిట్టిబాబు వారికి పార్టీ కండువా కప్పి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. మండల దేశం ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు, నాయకులు విజయ్‌కుమార్, సాంబశివన్, చిన్నదొరై, ఏసుమలై, శబరివాసన్, ప్రభాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష సిబ్బందికి రూ.20 వేలు ఆర్థిక సహాయం

**ఎస్ఆర్‌పురం, జనవరి 3 ప్రభాతవార్త:** మండల విద్యాశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ సమ్మెలో వున్న సమగ్ర శిక్ష సిబ్బందికి మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నాయకులు బుధవారం 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. సమగ్ర శిక్ష సిబ్బంది చేస్తున్న సమ్మెకు మండలంలోని ఉపాధ్యాయ సంఘాలు పూర్తి మద్దతు ప్రకటించాయి. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలు అరెస్టు

**ఎస్ఆర్‌పురం, జనవరి 3 ప్రభాతవార్త:** కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న అంగన్ వాడి కార్యకర్తలు, ఆయాలను బుధవారం ఎస్ఆర్ పురం పోలీసులు కొత్తపల్లిమిట్ట అడ్డుకొని అరెస్టు చేశారు. ఎస్ఆర్ పురం మండలం నుండి కలెక్టరేట్ ముట్టడికి ఆటోలు, బస్సుల్లో వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీసులు కొత్తపల్లిమిట్టలోని దీపిక కళ్యాణ మండపం వద్ద నిలుపదల చేసి అరెస్టు చేశారు. కలెక్టరేట్ ముట్టడికి నగరి, నింద్ర, కార్వేటినగరం, పచ్చికాపలం, వెదురుకుప్పం మండలాల నుండి భారీగా అంగన్‌వాడీ కార్యకర్తలు తరలిరాగా వారిని కొత్తపల్లిమిట్ట వద్ద పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

## ప్రతి వ్యక్తికీ ఆరోగ్యం కోసమే జగనన్న ఆరోగ్య సురక్ష

– మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్



**కుప్పం, జనవరి 3 ప్రభాతవార్త** ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండేలా చూసేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తోందని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. బుధవారం కుప్పం కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రతి ఇంట్లోని వ్యక్తికి వైద్య పరీక్షలు నిర్వహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అలాగే కుప్పం ఎమ్మెల్యేగా ఎమ్మెల్సీ భరత్, చిత్తూరు ఎంపి రెడ్డెప్పను మరోమారు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి, కౌన్సిలర్లు నాగరాజు, గణపతి, రంగయ్య, జగన్, మైనార్టీ అధ్యక్షుడు సర్దార్ బాషా, మాజీ ఎంపిటిసి వెంకటరామయ్య, కో కన్వీనర్ జయశంకర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ట్రస్ట్‌చే ఉచిత వైద్య శిబిరం

**కుప్పంరూరల్, జనవరి 3 ప్రభాతవార్త :** మండలంలోని మిట్టపల్లి పంచాయతీలో బుధవారం ఎన్టీఆర్ ట్రస్ట్ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా సుమారు వందమందికి వైద్యులు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, మాత్రలు అందించారు. కార్యక్రమంలో డా॥ మధు, రూప్సీ రాణి, పార్థసారథి, పార్టీ నేత మంజునాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాటు సారా తయారీ స్థావరాల పై పోలీసుల దాడి

**వెదురుకుప్పం, జనవరి 3 ప్రభాతవార్త :** మండలంలోని తెల్లగుండ్లపల్లె గ్రామంలో ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాటు సారా తయారీ స్థావరాల పై బుధవారం కార్వేటి నగరం ఎస్ఐ భాస్కర్ దాడులు నిర్వహించారు. తెల్లగుండ్లపల్లె గ్రామ పరిసరాల ప్రాంతాలలో పోలీసులు దాడు చేయగా సుమారు 900 లీటర్ల నాటు సారా తయారీకి అవసరమైన ఊట నిల్వలు లభ్యమైన్నట్లు చెప్పారు. ఊటను ధ్వంసం చేసి కారణమైన పొదలపల్లె సురేంద్ర,చొక్కా మునిక్రిష్ణయ్య, ఇరువురం దయాకృప, పాముల ఆరయ్యల పై కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్‌ఫెక్టర్ నాగరాజు కేసు నమోదు చేసిన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబందనలకు విరుద్దంగా నాటు సారా తయారు చేయడం, విక్రయించడం నేరమన్నారు. కావున తయారీకి పాల్పడ్డ వారి పై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రభుత్వం రద్దు చేస్తుందని గుర్తుచేశారు. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నాటు సారా తయారీకి పాల్పడ్డవారి సమచారం పోలీసులకు తెలియాజేసి సహకరించా లని కోరారు. దాడిలో ఎస్ఐతో పాటు సిబ్బంది గురవయ్య, రవి, రాజేష్, నవీన్, సుమలత పాల్గొన్నారు.

## మైనార్టీలను మోసం చేస్తున్న వైకాపా ప్రభుత్వం

– చిత్తూరు నియోజకవర్గ 'దేశం' మైనార్టీ అధ్యక్షుడు జాఫర్ షరీఫ్



**చిత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త:** వైకాపా ప్రభుత్వం మైనార్టీలను మోసం చేస్తోందని చిత్తూరు నియోజకవర్గ తెలుగుదేశం మైనార్టీ అధ్యక్షులు జాఫర్ షరీఫ్ ధ్వజమెత్తారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం జిల్లా తెలుగుదేశం మైనార్టీ నాయకులు నౌషాద్, మున్నాలతో కలిసి జాఫర్ షరీఫ్ విలేకరులతో మాట్లాడారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మైనార్టీలకు షాదీతోఫాతో పాటు మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం రుణాలు అందేవని అయితే వైకాపా ప్రభుత్వంలో మైనార్టీలకు ఎలాంటి లబ్ధి కలుగడం లేదని ఆరోపించారు. ముస్లీంలు తెలుగుదేశం పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని, ఈ సమావేశంలో నగర దేశం అధ్యక్షుడు అక్తర్‌భాషా, నగర ప్రధాన కార్యదర్శి నవాజ్‌భాషా, నాయకులు సయ్యద్ అన్సర్, గౌస్‌భాషా, జిలానీ, మహబూబ్‌భాషా, సర్దార్, సాహిల్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## విజయానందరెడ్డి సమక్షంలో...

వైకాపాలోకి చేరిన మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్



**చిత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త:** ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి సమక్షంలో బుధవారం మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ సరళామేరి, ఆమె భర్త పన్నీర్‌లు అనుచరులతో అధికార వైకాపాలో చేరారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ సరళామేరి, ఆమె భర్త పన్నీర్‌ను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ నుండి ఎన్నికై చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడటానికి ముందు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన సరళామేరి రాష్ట్రంలో కాంగ్రెస్ కనుమరుగు కావడంతో స్తబ్దుగా వుండిపోయారు. ప్రస్తుతం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంపి విజయానందరెడ్డి సమక్షంలో వైకాపా తీర్థం పుచ్చుకొన్నారు.

## హెల్త్ కేర్ వర్కర్లకు స్కిల్ కళాశాలలో శిక్షణ

**చిత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త:** సొసైటీ ఫర్ ఎంప్లాయిస్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(సీడాప్) బిఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన గ్రామీణ నేపథ్యం కల్గిన యువతీ యువకులకు జర్మనీ దేశంలో ఉపాధి కల్పించడానికి విజయవాడలో స్కిల్ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ ఓ ప్రకటనలో తెలిఏపారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు గురు, శుక్రవారాల్లో చిత్తూరు టిటిడిసి శిక్షణా కేంద్రంలో జరిగే స్క్రీనింగ్ టెస్టుకు హాజరు కావాలని ఆమె కోరారు. వివరాలకు 93905 04650 నెంబర్‌ను సంప్రదించాలని ఆమె తెలిపారు.

## కార్మికుల సమ్మెతో డ్రైవర్లుగా శానిటరీ ఇన్స్‌పెక్టర్లు

– పారిశుధ్య పనులు తనిఖీ చేసిన కమీషనర్ డాక్టర్ జె.అరుణ



చిత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త: మున్సిపల్ అవుట్ సోర్సింగ్ కార్మికుల సమ్మెతో పారిశుధ్య పనులకు ఇబ్బంది కలుగకుండా శానిటరీ ఇన్స్‌పెక్టర్లు డ్రైవర్ల పాత్ర పోషించి బుధవారం నగరంను శుభ్రం చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెతో పారిశుధ్య పనులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయడానికి కమీషనర్ డాక్టర్ జె.అరుణ పూనుకొన్నారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ పారిశుధ్యపనులను తనిఖీ చేసి వాహనాల షెడ్డును పరిశీలించి అధికారులతో చర్చించి చెత్తను తరలించడానికి అవసరమైన వాహన డ్రైవర్లను సిద్దం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, శానిటరీ ఆన్స్‌పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఇంటింటికి అయోధ్యరాముని అక్షింతలు

**చిత్తూరురూరల్, జనవరి 3 ప్రభాతవార్త:** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ పంపిన



అయోధ్యరాముని అక్షింతలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ సెంట్రల్ మండల అధ్యక్షుడు. శ్రీరామ సేవకులు షణ్ముగం తెలిపారు. తమ వార్డు పరిధిలోని ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి అక్షింతలను పంపిణీ చేస్తున్నామనీ, ఈ అక్షింతలను పూజామందిరంలో వుంచి నిత్యం రామస్మరణ చేస్తూ ఈనెల 22వ తేది నిర్వహించు బాలరాముని నూతన విగ్రహ ప్రాణ ప్రతిష్ట రోజున ఈ అక్షింతలతో ఇంటి పెద్దల చేతుల మీదుగా ఆశీర్వాదం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరింపేట మండల అధ్యక్షుడు సురేష్, శ్రీరామసేవకులు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శక పాలనకు నిదర్శనం వైఎస్సార్ ఫించను కానుక

చౌడేపల్లి, జనవరి 3 ప్రభాతవార్త:



అర్హులందరికీ వైఎస్సార్ ఫించను కానుకనందించి వైకాపా ప్రభుత్వం పారదర్శక పాలనకు నిదర్శనంగా నిలచిందని జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఎంపిపి గాజుల రామ్మూర్తి, వైకాపా మండలాధ్యక్షుడు కూరపర్తి అంజిబాబు లన్నారు. స్థానిక మండల పరిపాలనా భవనం సముదాయంలో ప్రభుత్వం పెంచిన రూ. 3వేల వైఎస్సార్ ఫించను కానుక వారోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. కుల, మత, వర్గ, పార్టీలకతీతంగా లంచాలు, వివక్ష, ఆశ్రిత పక్షపాతానికి తావులేకుండా అర్హులందరికీ ఫించన్లు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు.రాజంపేట, చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గాల యువజన అధ్యక్షుడు మిద్దింటి కిషోర్, వైసిజెస్ గ్రెంధెం మంజునాథ్, మండల ఉపాధ్యక్షులు నరసింహులుయాదవ్, సుధాకర్‌రెడ్డి, సచివాల యాల మండల కన్వీనర్ రుక్మిణమ్మ, సింగిల్‌విండో, ఆసుపత్రి కమిటీ ఛేర్మన్లు రవిచంద్రారెడ్డి, కె.కళ్యాణ్ భరత్, ఎంపిడిఓ సుధాకర్, సర్పంచు శ్రీరామ్‌భరత్‌వరుణ్, కృష్ణారెడ్డి, ఎంపిటీసీలు రూపారేఖ, తొండా శ్రీరాములు,మండలంలోనిసర్పంచులు,ఎంపిటీసీ సభ్యులు, మండలంలోని ఫించనుదారులు పాల్గొన్నారు.

## మహిళల్లో ఆణిముత్యం సావిత్రిభాయి పూలే

**చౌడేపల్లి, జనవరి 3 ప్రభాతవార్త:** మహిళల్లో ఆణిముత్యం సావిత్రిభాయి పూలే అని ఎంఇఓ తిరుమలమ్మ అన్నారు. సావిత్రిభాయిపూలే జయంతిని పురష్కరించుకొని మండలంలోని పాఠశాలల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేశంలోనే మొదటి ఉపాధ్యాయురాలుగా సమాజానికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు. ఎంఇఓ కేశవరెడ్డి, ఉపాధ్యాయులు అరుణ కుమారి, విజయలక్ష్మి, భారతి, పరిమళ, పూర్ణిమ, సమిత్ర, కవిత, కల్యాణి, మురళి, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

## పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి : యుటిఎఫ్



**చౌడేపల్లి, జనవరి 3 ప్రభాతవార్త:** సమగ్రశిక్షఅభియాన్(ఎస్ఎస్ఏ)లో పనిచేస్తున్న ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేసారు. స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద ఎస్ఎస్ఏ సిబ్బంది తలపెట్టిన సమ్మెకు యుటిఎఫ్ మద్దత్తు పలికింది. యుటిఎఫ్ మాజీ మండలాధ్యక్షుడు సహదేవయ్య, ఎస్ఎస్ఏ ఉద్యోగులు, సమగ్రశిక్ష చౌడేపల్లి శాఖ సభ్యులు పాల్గొన్నారు.

## పంచాయితీ అభివృద్ధే లక్ష్యంగా గ్రామ సభ

వెదురుకుప్పం, జనవరి 3 ప్రభాతవార్త :

పెరుమాళ్ళపల్లె పంచాయితీ అభివృద్ధి దిశగా గ్రామ సభ ఏర్పాటు చేసి సభ్యుల ఆమోదంలో ఏకగ్రీవంగా ప్రణాళికలు తయారు చేయడంజరిగిందని సర్పంచ్ బండి శశిఆనందరెడ్డి తెలిపారు. సచివాలయంలో డిడివో ధనలక్ష్మి ఆధ్వర్యంలో వార్డు సభ్యులతో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గత గ్రామసభలో చేసిన తీర్మాణాలు అభివృద్ధి చేసిన పనులు, ప్రభుత్వం కేటాయించిన నిధులు, పంచాయితీ అభివృద్ధికి చేసి వ్యయం తదితర అంశాలను తెలియాజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది, వార్డు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## నిస్సహాయులకు నీడనిచ్చిన సావిత్రిబాయి

– బిసి సంఘం నాయులకుల మునిరాజా యాదవ్



**వెంకటగిరిరూరల్ జనవరి3 ప్రభాతవార్త:** పురుషులతోపాటు సమానత్వాని పొందేందుకోసం కొంత మంది మహిళలు నడుంబిగించిపోరాడారు. ఆందుకోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసేందుకు వెనకాడలేదు వీరిలో సావిత్రిబాయి పూలే ఒకరి అని బిసి సంఘం నాయులకుల మునిరాజా యాదవ్ మంగళవారం అన్నారు. ఆమె నిస్సహయులకు నీడనిచ్చిన గొప్ప మహిళ సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి ఆమె చిత్రపటంకు పూలమాలు వేశారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లడుతూ సావిత్రిపూలే కేవలం శూద్రవర్ణాల్లో అణచివేతకు గురువుతున్న కులాల ప్రజల పక్షాన పోరాటం చేయడమే కాకుండా ఆగ్రవర్ణల మహిళలపై సాంప్రదాయాల పేరేతో జరుగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించారని పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయుకులు యం.వెంకటేశ్వర్లు, వి.హనుమంతు,టి శేఖర్,మదు, రమణయ్య గౌడ్, నరసయ్య, కృష్ణమూర్తి,డి రాజేశ్వరి,బి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

వెంకటగిరి, డిసెంబర్ 3, ప్రభాతవార్త



పట్టణం కాంపాలెం వద్ద ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొనడంతో లారీ డ్రైవర్ హరి క్యాబిన్లోని మృతి చెందాడు. కడప జిల్లా మైదుకూరు నుండి ఎర్రగడ్డ లోడ్‌తో తిరుపతికి వెళుతున్న లారీ బ్రిడ్జి ఢీకొనింది. పోలీసులు కథనం ప్రకారం రాపూర్ నుండి వెంకటగిరి వైపు వస్తున్న లారీ బ్రిడ్జిని ఢీకొని ఆగిపోయింది. మైదుకూరు నుండి ఎర్రగడ్డ లోడ్‌తో వెంకటగిరి వస్తున్న లారీ ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో ఎర్రగడ్డల లారీ డ్రైవర్ హరి అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై నరసింహారావు సంఘటనస్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీలను జెసిబి సహాయంతో పక్కకుతీశారు. శవాన్ని పోస్టుమార్టం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పెంచిన పింఛన్ల పంపిణీ



**బాలాయపల్లి, జనవరి 3 ప్రభాతవార్త**బాలాయపల్లి మండలం వెంగ మాంబపురం సచివాలయంలో ప్రభుత్వం పెంచిన 3 వేల రూపాయిలు పెన్షన్లను సర్పంచ్ బాపనపల్లి వెంకటసుబ్బయ్య, కార్యదర్శి దయాకర్లు పంపిణీ చేసారు. సిఎం జగన్మోహన్ రెడ్డి మాట ఇచ్చిన విధంగా 3 వేల రూపాయిలు పెన్షన్ పెంచాలని సర్పంచ్ సర్పంచ్ వెంకటసుబ్బయ్య తెలిపారు. పేదల సంక్షేమమే సిఎం జగన్మోహన్ రెడ్డి లక్ష్యం అని చెప్పారు. త్వరలో జరగబోవు ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు.

## ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరు సహకరించాలి



**గూడూరు, జనవరి 3 ప్రభాతవార్త** మున్సిపల్ కమిషనర్ చీపురు పట్టారు. బుధవారం వేకువజామున రైల్వేస్టేషన్ నుంచి సంగం థియేటర్ సెంటర్ వరకు కిలోమీటర్‌కు పైగా ప్రధాన రహదారిపై చెత్తాచెదారం తొలగించారు. ఆయనతో పాటు మున్సిపల్ కార్యాలయ అధికారులు, 30మంది వరకు సిబ్బంది శ్రమదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పదిరోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉన్నారన్నారు. ప్రజలు, స్వచ్ఛంధ సంస్థలు సహకరించాలని కోరారు. స్వచ్ఛంధంగా వస్తున్న ప్రైవేటు కార్మికులకు సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుపడకూడదని చెప్పారు. సమ్మెకు తాము వ్యతిరేకం కాదని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గూడూరులో తనతో పాటు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు రైల్వేస్టేషన్ నుంచి సంగం థియేటర్ వరకు కిలోమీటరు మేర రోడ్డుపై ఉన్న చెత్తను ఊడ్చారని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

– కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి

**గూడూరు, జనవరి 3 ప్రభాతవార్త** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ద్వారానే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి అన్నారు. బడుగు, బలహీన వర్గాల పేదలు, మైనార్టీలు, ఎస్సీలు, బీసీలు, దళితుల అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన అన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముందుగా గూడూరు నియోజకవర్గ ప్రజలకు, జిల్లా ప్రజలకు రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సుఖ శాంతులతో వర్ధిల్లాలని, ప్రజలు సంతోషంగా ఈ నూతన సంవత్సరంలో జీవించాలని ఆకాంక్షించారు. ప్రజలు ఈ సారి కేంద్రంలో ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలు యువత కాంగ్రెస్ పార్టీలో చేరడానికి సిద్ధమవుతున్నారని అన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళలా సహకరిస్తా

– మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్



**గూడూరు, జనవరి 3 ప్రభాతవార్త** జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లవేళలా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ సంక్షేమ నిధికి సునీల్‌కుమార్ తన సొంత నిధుల నుంచి రూ.50 వేలు అసోసియేషన్ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ తన రాజకీయ అనుభవంలో అనేకమంది జర్నలిస్టులు జీతభత్యాలు లేకపోయినా గౌరవం కోసం వృత్తిని నమ్ముకొని వ్యక్తిగతంగా పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించానన్నారు. ఈ కార్యక్రమంలో ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ జమాలుల్లా, ఉడతా శరత్ యాదవ్, ఉపాధ్యక్షులు పర్చూరు బాలకృష్ణ, సహాయ కార్యదర్శి యల్లంరాజు తులసిరాజు, ప్రసాద్, కోశాధికారి శశిధర్, తిరుమలశెట్టి భవాని ప్రసాద్, సభ్యులు మంగళపూరు శ్రీనివాసులు, డబ్బు కృపానిధి, చిట్టేటి వెంకట నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యానికి పెద్దపీట వేసిన ఘనత సీఎం జగన్‌దే



**గూడూరు, జనవరి 3 ప్రభాతవార్త** రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆ మేరకు ఆరోగ్యశ్రీ కార్డు పరిమితి రూ.25 లక్షలకు పెంచారని స్వచ్ఛాంధ్ర సంస్థ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ పేర్కొన్నారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని వీరారెడ్డిపల్లి ప్రాంతంలో ఏర్పాటై ఉన్న జిఎస్ఆర్ పురపాలక పాఠశాలలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. పేదలకు ఆరోగ్యశ్రీ కార్డులు ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సురక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ పదానమవతి, నాయకులుబొమిడిశ్రీనివాసులు, సురేష్‌రెడ్డి, రాఘవరెడ్డి, బత్తిని విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**నాయుడుపేట, జనవరి 3 ప్రభాతవార్త** నాయుడుపేటలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. సావిత్రిబాయి పూలే జీవితం సమాజానికి ఆదర్శనీయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు.నాయుడుపేటపట్టణంలోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## తుమ్మూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం



**నాయుడుపేట, జనవరి 3 ప్రభాతవార్త** నాయుడుపేట మున్సిపల్ పరిధిలోని తుమ్మూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అలాగే ఆరోగ్యశ్రీ కింద రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు పరిమితిని పెంచారని హెల్త్ సెంటర్ సిబ్బంది తెలియజేశారు.

## చదువుల తల్లి సావిత్రిబాయి పూలే



**కోట, జనవరి 3 ప్రభాతవార్త** భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని, ఆమె మహిళా విద్య కోసం ఎన్నో త్యాగాలు చేశారని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సమాజం మార్పు కోసం సావిత్రిబాయి పూలే చేసిన సేవలను కొనియాడారు. బహుజనుల విద్య కోసం ఆమె నిరంతరం పోరాటాలు చేశారని చెప్పారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

– ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి



**సూళ్లూరుపేట, జనవరి 3 ప్రభాతవార్త**

సూళ్లూరుపేట మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సూళ్లూరుపేట మండలంలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ పథకాలు, వాటి అమలు తీరును సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. దీనికి స్పందించిన ఎంపిపి విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మురళి, పంచాయతీరాజ్ డిఇ బందిలి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## 5వ తేది మంగళగిరిలో జరగనున్న ధర్నాని జయప్రదం చేయండి



**గూడూరు, జనవరి 3 ప్రభాతవార్త** ఈ నెల 5వ తేదిన విఆర్ఏల సమస్యల పరిష్కారానికై మంగళగిరిలోని సిసిఎల్ఏ కార్యాలయం వద్ద మహాధర్నాను జయప్రదం చేయాలని విఆర్ఏల రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు కొల్లపూడి సుబ్బయ్య పిలుపునిచ్చారు. బుధవారం తిరుపతి జిల్లా గూడూరులోని గ్రామ ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన డివిజన్ కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లాకు చెందిన ఎన్. రాఘవరెడ్డి 1986లో విఆర్ఏల సంఘం 23 జిల్లాల్లో స్థాపించడం జరిగిందని, అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు పైబడిపోతున్నా విఆర్ఏలు ఏ ఒక్క సమస్య పరిష్కారం చేయకుండా అన్ని వర్తింప చేయాలని ఆయన డిమాండ్ చేసారు. విఆర్ఏల దీర్ఘకాలికంగా ఉన్న పలు సమస్యల పరిష్కారం కొరకై ఈ నెల 5వ తేదిన మంగళగిరిలోని సిసిఎల్ఏ కార్యాలయం వద్ద తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, నెల్లూరు జిల్లాల గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, పెంచల నరసయ్య, తిరుపతి జిల్లా అధ్యక్షులు గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మలరాజారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



**చిల్లకూరు, జనవరి 3, ప్రభాతవార్త** చిల్లకూరు గ్రామంలో మాజీ వైస్ ఎంపిపి తుమ్మల రాజా రెడ్డి ఉత్తరక్రియలలో టిడిపి నాయకులు పాల్గొని చిత్రపటానికి పూల మాల వేసి నివాలర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో ఉంటూ చిల్లకూరు మండల ఉపాధ్యక్షుడిగా ఉండి ఎంతోమంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు నాయకులకు అనేక రకాలుగా సేవలు అందించిన రాజారెడ్డి మృతి చెందిన పార్టీకి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షులు డాక్టర్ శ్రీపతి బాబు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



**సూళ్లూరుపేట, జనవరి 3 ప్రభాతవార్త** సూళ్లూరుపేటలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా వీవర్స్ కమిటీ తిరుపతి జిల్లా కార్యదర్శి వద్ది విజయలక్ష్మి, సూళ్లూరుపేట నియోజకవర్గ సంయుక్త కార్యదర్శి బండారు శారద, బిసి ప్రధాన కార్యదర్శి సిహెచ్ రమణయ్య, వావ్ సంస్థ అధ్యక్షురాలు నాదెండ్ల శాంతకుమారి, భవిత స్కూలు టీచర్ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో సిద్ధాంతి మృతి



**తడ, జనవరి 3 ప్రభాతవార్త** తడ మండలం కొండూరు పంచాయతీ పరిధిలోని పులివేంద్ర వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 75 ఏళ్ల వయస్సున్న ఒక సిద్ధాంతి మృతిచెందాడు. జాతీయ రహదారిని దాటుతున్న ఆయనను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి శవాన్ని తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు



**చిల్లకూరు, జనవరి 3, ప్రభాతవార్త** భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి, నిమ్నవర్ణాల అభ్యున్నతికి కృషి చేసిన, కులమత బేధాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి, ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన గొప్పవ్యక్తి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను జడ్పిహెచ్ఎస్, పిసివి పాలెం నందు ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం బి. సుధాకర్, వై. చంద్ర, లీల, డి. ప్రజేంద్రరెడ్డి, శ్రీనివాసులు,సంధ్య,విద్యుల్లత, నాగభూషణమ్మ, ఆదిలక్ష్మి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును కలసిన తెదేపా సర్పంచులు..ఎంపిటిసిలు

**కుప్పం, జనవరి 3 ప్రభాతవార్త** కుప్పం నియోజకవర్గ పరిధిలో ఉన్న పలువురు తెలుగుదేశం పార్టీ సర్పంచులు, ఎంపిటిసిలు బుధవారం తెదేపా అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబునాయుడును కలిశారు. ఈసందర్భంగా గత మూడేళ్ల కాలంగా పంచాయతీల్లో నెలకొన్న సమస్యలు, నిధుల మళ్లింపు వ్యవహారాలను చంద్రబాబుకు వివరించారు. తెదేపా ప్రభుత్వం అధికారంలో రాగానే గ్రామాల అభివృద్ధికి తాము రూపొందించిన ప్రణాళికలు, నివేదికలను అధినేత చంద్రబాబుకు అందించారు. ఈసందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ వైకాపా పాలనలో పంచాయతీలు నిర్వీర్యమైపోయాయన్నారు. మరలా అధికారంలో రాగానే పంచాయతీలను అభివృద్ధి బాట పట్టిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచులు ధనశేఖర్, ఎల్లప్ప, రోహిత్ రవి, జనార్ధనరెడ్డి, ఎంపిటిసిలు శ్రీనివాసులు, నామాలప్పపాల్గొన్నారు.

## కంటి చూపునిస్తే ప్రపంచాన్ని ఇచ్చినట్లే :మంత్రి



**నగరి, జనవరి 3 ప్రభాతవార్త:** కంటిచూపు పోతే ప్రపంచం వారికి చీకటై పోతుందని అలాంటిది వారికి కంటి చూపునిస్తే ప్రపంచాన్ని వారికి ఇచిచనట్లని మంత్రి రోజా అన్నారు. బుధవారం తన నివాస కార్యాలయం వద్ద మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మొబైల్ ఐ సర్జికల్ యూనిట్‌ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు. దూర ప్రాంతాలకు వెళ్ళడానికి తోడు లేకపోవడం, ఖర్చు భరించి వెళ్ళలేకపోవడం ఇలాంటి సమస్యల కారణంగా పలువురు కంటి వ్యాధులు ఉన్నా చికిత్స చేసుకోలేకపోతున్నారన్నారు. ఆమె కూడా వైద్య శిబిరంలో కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇదంతా మంత్రి రోజా చొరవతోనే జరుగుతుందని శంకర నేత్రాలయ ప్రతినిధి అరుల్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి,నింద్ర ఎంపీపీ దీప, శంకర నేత్రాలయ జిల్లా ఇన్‌చార్జి అర్పిత, సిబ్బంది, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిభాయ్ పూలే జయంతి వేడుకలు

**నగరి, జనవరి 3 ప్రభాతవార్త:** సావిత్రిభాయ్ పూలే 193వ జయంతి సందర్భంగా మున్సిపల్ పరిధి చింతలపట్టెడ వినాయకపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సంఘసంస్కరణకు చేసిన కృషిని గూర్చి వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసన్న రాజకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు: ఎమ్మెల్యే



**పెద్దపంజాణి, జనవరి 3 ప్రభాతవార్త :** వైకాపా ప్రభుత్వంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. బుధవారం మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమంలో భాగంగా నూతన లబ్దిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



**పెద్దపంజాణి, జనవరి 3 ప్రభాతవార్త:** మండలంలోని ముత్తూకూరు, నాగిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూజలు చేశారు.కార్యక్రమాల్లో హెచ్‌ఎం కెవి దాస్, ఉపాధ్యాయులు నారాయణస్వామి, చంద్రశేఖర్, శకుంతల, వసంత, షకీలాబేగం, మీనాక్షి, వాణిశ్రీ, గంగాధర్, ఆంజప్ప, మాధవన్, రాజేష్ పాల్గొన్నారు.

## వైకాపా సీనియర్ నేత మృతి



**పెద్దపంజాణి, జనవరి 3 ప్రభాతవార్త :** మండలంలోని బసవరాజు కం డ్రిగకు చెందిన వైకాపా సీనియర్ నేత బాబు విజయరెడ్డి బుధవారం వేకువజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి విజయరెడ్డి స్వగృహంకు చేరుకుని ఘన నివాళులు అర్పించారు. బాధిత కుటుంబంకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. బాబు విజయరెడ్డి మృతి తీరని లోటు అన్నారు.

## పర్యవేక్షణ లేదు! శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలనాతీరు!

**శ్రీకాళహస్తి,జనవరి 3 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలనా తీరు రోజు రోజుకు అస్తవ్యస్తంగా మారుతుంది. పవిత్రమైన ఆలయంలో రోజు రోజుకు సంప్రదాయాలు,ఆచారాలకు విఘాతం ఏర్పడుతుంది. బుధవారం రెండవ గేటు వద్ద సెక్యూరిటి సిబ్బంది తమ ఇన్‌చార్జి మణికి సంబంధించి 'జన్మదిన వేడుకలను' జరపటం చర్చనీయాంశంగా మారింది.ఆలయం పవిత్రతకు విఘాతం కల్గుతున్నా ఆలయాధికారి ఎందుకు పట్టించుకోవటం లేదనే విమర్శలు చోటు చేసుకున్నాయి. వివరణ కోరటానికి ప్రయత్నించినా కనీసం చరవాణి తీయటం లేదు.ఇక ఆలయానికి సంబంధించిన సెక్యూరిటి సిబ్బంది తీరు రోజు రోజుకు వివాదాస్పదంగా మారింది. వారు ఆలయంలో పార్టీలను తిప్పినా చర్యల్లేవు. వారు విదులు నిర్వహించకున్నా పట్టించుకునే దిక్కులేదు. దాంతో బుధవారం ఏకంగా ఆలయ హద్దుల్లో జన్మదినవేడుకలు, కేక్‌లు కట్ చేయటం హల్‌చల్‌చేస్తుంది.మరి అధికారులు ఏం చర్యలు తీసుకుంటారో లేక టేక్ ఇట్ ఈజీ పాలసీని అనుసరిస్తారో ముక్కంటీశునికే ఎరుక!

## బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలికి శివయ్య ప్రసాదాలు



**శ్రీకాళహస్తి, జనవరి 3 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిని శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ విజయవాడలోమర్యాదపూర్వకంగా కలిసి శ్రీకాళహస్తీశ్వ రస్వామి శేషవస్త్రాలు,తీర్థప్రసాదాలుఅందించారు.పార్టీలో కోలా.ఆనంద్‌కు తగిన ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలోజిల్లాఅధ్యక్షుడుచంద్రప్ప,జిల్లా కార్యదర్శి మరియు అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, అమ్మపాలెం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు

**శ్రీకాళహస్తి, జనవరి 3 ప్రభాతవార్త:**



సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పట్టణంలోని ఉషోదయా ఫౌండేషన్ అధ్యక్షురాలు చక్రాల.ఉష ఆధ్వర్యంలో బాబుఅగ్రహారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయినులను దుశ్శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎన్‌సి.సుహాసిని అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభను ఉద్దేశించి ఉషోదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు చక్రాలఉష మాట్లాడుతూ భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయినీ, రచయిత్రి అని నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతిరావుపూలే సతీమణి సావిత్రిబాయి కులమత బేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి అని తెలిపారు.అనంతరం మహిళా ఉపాధ్యాయినులు ఎన్‌సి.సుహాసిని, కె.స్వరూపారాణి, కె.వరలక్ష్మి, సి.పార్వతీ, ఎం.సుమిత్ర కుమారి, ఎస్.కళ్యాణ్, ఈ.మంజులత, ఎ.రూపవాణి, ఎం.భాను, ఎన్.గ్లోరీసుకుమారిలను దుశ్శాలువతో సత్కరించి మెమొంటోలను అందించారు. కార్యక్రమంలో మహేష్, నానీ,లోకేష్, రాజా, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని పథకాలతో బిజెపిలో చేరికలు



**శ్రీకాళహస్తి, జనవరి 3 ప్రభాతవార్త:** మోదీ పథకాలకు ఆకర్షితులై రాష్ట్ర సమాజ్‌వాదీ పార్టీ నేత అమ్మపాలెం రమణారెడ్డి బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్, జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప నేతృత్వంలో రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో పార్టీ కేంద్ర కార్యాలయంలో బిజెపి కండువా కప్పి ఆయన్ను పార్టీలోకి సాదరంగా స్వాగతించారు. ఈసందర్భంగా బిజెపిలో చేరిన రమణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటిపురందేశ్వరికి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చంద్రప్ప, జిల్లా కార్యదర్శి, అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే ఆదర్శమూర్తి

**శ్రీకాళహస్తి, జనవరి 3 ప్రభాతవార్త:**



ప్రముఖ సంఘ సంస్కర్త బడుగు, బలహీన వర్గాల ఆదినాయకుడు మరియు మొట్టమొదటి మహాత్మా బిరుదాంకితుడు స్వర్గీయ జ్యోతిబాపూలే సతీమణి సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు తెలిపారు. కార్యక్రమంలో వన్నెకులక్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్‌రవి, సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం, మైనార్టీ విభాగం షేక్‌జిలానీ, డివినారాయణ, మునిరాజయాదవ్, బీమాలభాస్కర్, మణి, రామచంద్రయ్య, దుర్గ, గణేష్, రాజ, పాండు, రియాజ్, మహ్మద్‌రఫి, సులేమాన్, ముజీబ్, సలార్, రఫి తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా సోషల్ మీడియా సైనికులకు సత్కారం

**తొట్టంబేడు, జనవరి 3 ప్రభాతవార్త**



పట్టణ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి తెలుగుదేశంపార్టీ సోషల్ మీడియా సైనికులను శాలువా కప్పి తెలుగుదేశంపార్టీ జెండాను అందించారు. తెలుగుదేశంపార్టీ జెండాను పొందిన వారిలో కన్నావరం హరిబాబు, మునిరాజయాదవ్, ఈశ్వర్‌రెడ్డి, జిలానీ, అస్మత్, మస్తాన్‌బాయ్, గంగిరెడ్డి, బాలాజీ సురేష్, సుహాసిని, తదితరులను సత్కరించారు.

## నేడు కైలాసకోన ఆలయ హుండీ లెక్కింపు

**నారాయణవనం, జనవరి 3 ప్రభాతవార్త :** మండలంలోని అరణ్యంకండ్రిగ పంచాయతీ కైలాసకోనలో వెలసిన కామాక్షాంభిగా సమేత కైలాసనాధుని హుండీ లెక్కింపు గురువారం ఉదయం 10.30గంటలకు జరుగుతుందని పాలక మండల చైర్మన్ ఇ సుబ్రమణ్యంయాదవ్, ఆలయ కార్యనిర్వాహణా ధికారి ఎం కృష్ణానాయక్‌లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారుఅధికారులు, భక్తులు అందరు పాల్గొనాలని కోరారు.

## ఘనంగా మహిళా టీచర్ దినోత్సవ వేడుకలు



**నారాయణవనం, జనవరి 3 ప్రభాతవార్త :** పరమేశ్వరమంగలంలోని శ్రీ చైతన్య పాఠశాలలో మహిళా టీచర్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి తిరుపతి ఎజిఎం సురేష్ పాల్గొని సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలలు వేసి నివాళి అర్పించారు.ప్రిన్సిపాల్ కె గోపి, అకాడమిక కో ఆర్డినేటర్ బాలాజీ, డీన్ సంపత్‌కుమార్, టెన్త్ విభాగం ఇంచా ర్జీ శివ, సీ బ్యాచ్ ఇంచార్జీ వినోద్‌కుమార్, ఇంచార్జీలు సౌమ్య, నగేష్, ఉపాధ్యాయునీ, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

## నారాయణవనంలో బాబు షూరిటీ

-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి విశేష స్పందన

**నారాయణవనం, జనవరి 3 ప్రభాతవార్త :** మండలకేంద్రలోని నారాయణవనం గాండ్లవీధి, బిసికాలనీ, ఎగువ పద్మశాలీవీధిలో బుధవారం బాబు షూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు పి గిరిబాబు, ఎన్ భాస్కరన్, టి షణ్ముగంలు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు కెఎస్‌రవి, అచ్చుకట్ల హరి, సి బాబు, మురుగేశంరెడ్డి, కె వాసుదేవన్, ఆరుముగంశెట్టి, గాండ్ల రమేష్, శరవణ,లక్ష్మణన్,కందస్వామిమొదలియార్, సి బాబు, కుమార్, లోకయ్య, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి బ్యానర్ చింపివేతలో...నా ప్రమేయం లేదు

**నారాయణవనం, జనవరి 3 ప్రభాతవార్త :** మండలంలోని కొండలచెరువు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర శుభాకాంక్ష బ్యానర్ చింపివేతలో నా పాత్ర ఏమాత్రం లేదని బికె పళణిరెడ్డి ప్రభాతవార్తకు వివరణ ఇచ్చారు. తనపై కక్ష కట్టి పార్టీకి దూరం చేయాలని కొంతమంది కోరుకుంటున్నారన్నారు. అయినా పట్టించుకోనన్నారు.

## కోళ్లు 50 యూనిట్లు పంపిణీ



**వడమాలపేట, జనవరి 3 ప్రభాతవార్త:** నిరుపేదలకు జీవనోపాధి కల్పించడం కోసం సబ్సిడీపై కోళ్లు అందజేసినట్లు వెలుగు ఏపీఎం మునికృష్ణారెడ్డి తెలిపారు. మండలంలోని రామసముద్రంలో వైఎస్‌ఆర్ క్రాంతి పథకం కింద 50 యూనిట్లు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిలో బరువు కలిగిన 11 కోళ్ళను యూనిట్‌గా చేసిసబ్సిడీ పోను మూడు వేల రూపాయలకు 50 మంది లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తి, లబ్ధిదారులు, సీసీలు పాల్గొన్నారు.

## పాడి రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

**పిచ్చాటూరు, జనవరి 3 ప్రభాతవార్త:** పాడి రైతులు ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల పథకాలను సద్వినియోగం చేసుకుని పాల ఉత్పత్తి పెంపొందించు కోవాలని పశు వైద్యాధికారి ధనంజయ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కొత్తగొల్ల కండ్రిగలో పశువులకు గాలుకుంటి వ్యాధి టీకాలతో పాటు, గర్భకోశ వ్యాధులకు చికిత్సలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పునరుత్పత్తి కోసం ఆధునిక సెమెన్ ట్యూబ్‌ల పాటు టీకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ గంగాధరం, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## దేశంలోనే అత్యధికంగా 3 వేలు పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం

**పిచ్చాటూరు, జనవరి 3 ప్రభాతవార్త:**



భారతదేశంలోని 29 రాష్ట్రాల్లో అత్యధికంగా పెన్షన్‌ని రూ.3 వేలు ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నూతన పెన్షన్లతో పాటు పెంచిన పెన్షన్లను అందించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్‌నాయుడు, నాయకులు మోహన్, శోభన్‌బాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవ పార్టీ కార్యాలయం ప్రారంభం

**పిచ్చాటూరు, జనవరి 3 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన పిచ్చాటూరులో బైపాస్ పెట్రోల్ బంకు ఆవరణలో కాంప్లెక్స్‌లో బుధవారం ప్రజాసేవ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులను పలువురిని ఘనంగా సన్మానించి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రతి నిరుపేదకు సేవ చేయాలన్నదే ప్రధాన లక్ష్యంగా పార్టీ స్థాపించామని ఆయన పేర్కొన్నారు. పార్టీని గ్రామ స్థాయిలో విస్తరించినందుకు ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు.

## శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయానికి బంగారు తాళిబొట్టు వితరణ



**పుత్తూరురూరల్, జనవరి 3 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణం గేటు పుత్తూరు కామరాజ్ నగర్ వాల్మీకి వీధిలో వెలసి ఉన్న శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయానికి పుత్తూరు పట్టణం బజారువీధిలో నివాసం ఉండు కూరెళ్ళ బాలాజీ కుమార్ కూరెళ్ళ జగదీశ్వరి(ప్రసాద్ జువెలర్స్) దంపతులు అమ్మవారి ఆలయానికి బంగారుతో తయారు చేసి గిన్నెబొట్టు గుండ్లు, వితరణగా అందించారు. ఈ ఉభయ దాతకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించారు.

## శ్రీ సదాశివుని హుండీ ఆదాయం లెక్కింపు



**పుత్తూరురూరల్, జనవరి 3 ప్రభాతవార్త:** పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయం హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం ఉదయం నిర్వహించారు. హుండీ ఆదాయం రూ.5లక్షల 84 వేల 89లు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామచంద్రరెడ్డి, టెంపుల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ సుమన్‌ప్రియ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిభాయ్ పూలే గొప్ప మహిళా సంఘ సంస్కర్త



**రేణిగుంట, జనవరి 3 ప్రభాతవార్త:** సావిత్రిభాయ్ పూలే గొప్ప మహిళా సంఘ సంస్కర్త అని రేణిగుంట పంచాయతీ సర్పంచ్ నాగేషం అన్నారు. రేణిగుంట ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో బుధవారం సావిత్రిభాయ్ పూలే జన్మదినాన్ని నిర్వహించారు. అనంతరం ఆషా జూలియన్‌రాజు అన్నసంపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సునీతగౌడ్ అధ్యక్షతన మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్‌రాజు, రేణిగుంట మండల కో–ఆప్షన్ సభ్యులు అసన్, మునీంద్ర, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో మోగిన మునిసిపల్ సమ్మె సైరన్

**తిరుపతి కార్పొరేషన్,జనవరి 3 ప్రభాతవార్త**

ఏఐటియుసీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి మునిసిపల్ కార్మికులు సమ్మె ప్రారంభించారు. కార్పొరేషన్ పరిధిలోని విధులు బహిష్కరిం చారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు తులసింద్ర, మాట్లాడుతూ ప్రభుత్వం సానుకూలంగా స్పందించని కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి, విశ్వనాథం, గౌరవ అధ్యక్షులు, రామచంద్రయ్య, నదియా ఏఐసిటియు సీ నాయకులు ప్రధాన కార్యదర్శి, రవి, నాయకులు సిహెచ్. శివకుమార్, మహేంద్ర, పద్మనాభరెడ్డి,ఇందుమతి, అరుణ, దొరస్వామి,తదితరులు పాల్గొన్నారు.

## తిరుచానూరు మహిళ మండల ప్రథమ పౌరురాలుగా వేములు

**తిరుచానూరు, జనవరి 3 ప్రభాతవార్త** తిరుచానూరు గ్రామ మహిళ మండలానికి ప్రథమ పౌరురాలుగా ఎన్నిక కావడం చాలా సంతోషంగా వుంది అని తిరుచానూరు సర్పంచ్ వైకాపా తూర్పు మండల అధ్యక్షులు రామచంద్రారెడ్డి పలువురు వైకాపా ఎంపిటిసిలు ఆనందం వ్యక్తం చేశారు. తిరుచానూరు వైకాపా సీనియర్ నాయకురాలుగా తిరుచానూరు ఎంపిటిసిగా తరువాత తిరుపతి గ్రామీణ మండల వైస్ ఎంపిపిగా వేముల యశోద విధులను నిర్వహించడం విధితమే. ఈ క్రమంలో తిరుపతి గ్రామీణ మండల ఎంపిపి మోహిత్‌రెడ్డి తుడా చైర్మన్ కావడం, ఆ పై చంద్రగిరి నియోజకవర్గం వైకాపా బాధ్యులుగా వ్యవహరించడంతో ఎంపిపి పదవికి రాజీనామా చేశారు. తరువాత చంద్రగిరి ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎంపిపిగా వేముల యశోదను ఎన్నుకున్నారు. ఎంపిపిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎంపిపి యశోదకు ఆమె కార్యాలయంలో తిరుచానూరు ఎంపిటిసిలు శేఖర్, నరేష్ రెడ్డి, వేమూరు ఎంపిటిసి యోగానంద రెడ్డి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## అమ్మవారి ఆలయానికి వీల్ చైర్ వితరణ

**తిరుచానూరు, జనవరి 3 ప్రభాతవార్త**

తిరుచానూరు అమ్మవారి ఆలయానికి వీల్ చైర్‌ను వితరణగా అందించారు. ఆలయ సూపరింటెండెంట్ శేషగిరి సమాచారం మేరకు మదనపల్లికి చెందిన సుశీల బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణం వద్ద వీల్ చైర్‌ను వితరణగా అందించారని తెలిపారు. అనంతరం ఆమెకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించామని వివరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్‌తో పాటు విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## విశ్రాంత ఉద్యోగులకు,కుటుంబాలకు...

అన్ని విధాలా సహకారం -ఆర్టీసి అధికారులు





**తిరుపతి,జనవరి 3ప్రభాతవార్త:** ప్రజారవాణా సంస్థలో అనేక సంవత్సరాలుగా సేవలందించి పదవీ విరమణ చేసిన తరువాత విశ్రాంత ఉద్యోగులుగా వున్న వారికి అన్ని విధాలా సహకారం అందిస్తామని తిరుపతి రీజనల్ మేనేజర్, కడప ఈడి ఇన్‌ఛార్జి చెంగల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ఆర్టీసి విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యవర్గం సమావేశం జరిగింది. అసోసియేషన్ ఏర్పాటై పదిసంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా జరిగిన సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు మరణిస్తే వారికి దహనక్రియల ఖర్చులకు 5వేల రూపాయలు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి చేపట్టిన పలు కార్యక్రమాలు వివరించారు. రాష్ట్ర వర్కింగ్‌ప్రెసిడెంట్ ఎస్.కైలాస్‌నాథ్, రాష్ట్ర కార్యదర్శి జెఎంఆర్‌నాయుడు, రీజనల్ అధ్యక్షుడు ఎ.చంద్రయ్య, రీజనల్ కార్యదర్శి ఎస్. శేషాద్రి, కోశాధికారి ఆర్.సహదేవరాజు, రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసులు,ప్రచారకార్యదర్శి ఎం.మునిరత్నం పాల్గొన్నారు.

## ఎస్వీ శిల్ప కళాశాలలో కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

**తిరుపతి మహిళావర్సిటీ, జనవరి 3 ప్రభాతవార్త:** శ్రీ వెంకటేశ్వర సంప్రదాయ ఆలయ శిల్ప కళాశాలలో 2023 –24 విద్యాసంవత్సరానికి గాను సాయంత్రం కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు జనవరి 20వ తేది వరకు పెంచడమైంది. ఏడాది కాలం శిక్షణ కలిగిన సర్టిఫికేట్ కోర్సులైన సంప్రదాయ కళంకారి కళ, శిల్పకళలలో ప్రాథమిక అంశాలు అనే కోర్సులు నూతనంగా ప్రవేశ పెట్టారు.ఇతర వివరాల కోసం ప్రిన్సిపాల్, ఎస్వీ సంప్రదాయ ఆలయ నిర్మాణ శిల్ప శిక్షణ కళాశాల, అలిపిరి రోడ్, బాలాజీ లింక్ బస్టాండ్ పక్కన, తిరుపతిలో గానీ 0877 – 2264637, మొబైల్ నెం. 9866997290 నంబర్లను గానీ సంప్రదించగలరు.

## రిమ్స్‌లో ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్స్ సదస్సు

**తిరుపతి (క్రీడా), జనవరి 3 ప్రభాతవార్త**



తిరుపతిలోని కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ రిమ్స్‌లో రెండు రోజుల ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ స్కిల్స్ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. జె. ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఎంతో మంది విద్యార్థులు డిగ్రీలు పట్టుకొని బయటకు వస్తున్నారని, కంపెనీలలో ఉద్యోగాలున్నా అర్హత పొందలేకపోతున్నారని దీనికి ప్రధాన కారణం కమ్యూనికేషన్ స్కిల్స్ లేకపోవడమేనని వివరించారు. ఈ సమావేశంలో నూతన ఎంసిఎ, ఎంబిఏ, ఎంఎస్‌సి విద్యార్థులు, హెచ్‌ఓడీలు డా.పి. నిరంజన్ రెడ్డి, పి. మధుర, అధ్యాపకులు పాల్గొన్నారు.

## తిరుపతిరూరల్ మండలాధ్యక్షురాలుగా యశోద

**తిరుపతిరూరల్, జనవరి 3 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలుగా వేముల యశోద బుధవారం బాధ్యతలు చేపట్టారు. చంద్రగిరి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని పార్టీ అధిష్టానం ప్రకటించిన విషయం తెల్సిందే. దీంతో మోహిత్‌రెడ్డి తిరుపతిరూరల్ ఎంపిపి పదవికి రాజీనామా చేసారు. స్థానిక ఎమ్మెల్యే చొరవతో ఉప మండలాధ్యక్షరాలుగా వున్న యశోదను ఎంపిపి పగ్గాలు చేపట్టారు. నిరాడంబరంగా ఎంపిపిగా బాధ్యతలు చేపట్టిన యశోదనుతిరుపతిరూరల్ ఎంపిడిఓ కనపర్తి రవికుమార్ పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## చెత్త సేకరణలో సహకరించండి



**నగరి, జనవరి 3 ప్రభాతవార్త:** మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో మున్సిపల్ పరిధిలోని నివాసితులు, వ్యాపార సంస్థలు చెత్త సేకరణలో సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ కె.ఎల్.ఎన్.రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి వద్ద వ్యాపార సంస్థల వద్ద పోగయ్యే చెత్తకుప్పలను వారు తమ వద్దే బిన్‌లలో సేకరించి ఉంచాలన్నారు. మురుగు కాలువల్లోను, బహిరంగ ప్రదేశాల్లోను, రోడ్లపైనా చెత్తకుప్పలు పడవేయరాదన్నారు. సమ్మె ముగిసిన వెంటనే చెత్తను పారిశుధ్య సిబ్బంది సేకరించుకోవడం జరుగుతుందన్నారు. అప్పటి వరకు పారిశుధ్య నిర్వహణలో సహకరించాలని కోరారు.

## నగరి మున్సిపాలిటీలో గాలి భానుప్రకాష్ పర్యటన

**నగరి, జనవరి 3 ప్రభాతవార్త:** మీ కోసం– తెలుగుదేశంలో బాబు షూరిటీ– భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా నగరి మున్సిపాలిటీలో నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. బుధవారం నగరి మున్సి పాలిటీ 1,2,3 వార్డుల్లో ఆయన పర్యటించారు. నగరి మున్సిపాలిటీలోని నగరిపేటలో ఆయనకు అడుగడుగునా మహిళలు హారతులతో స్వాగతించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలవడం వెంటనే మీ సమస్యలు తీరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయనకు నగరి పేటలోని సమస్యలను వివరించారు. ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తే భవిష్యత్ గ్యారంటీ అని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడి పందెం రాయళ్ళును పట్టుకున్న ఎస్ఇబి అధికారులు



**తిరుపతిరూరల్, జనవరి 3 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ కుంట్రపాకం గ్రామ పంచాయతీలో రహస్య ప్రాంతంలో కోడి పందేలు ఆడుతున్న 17మంది పందెం రాయళ్ళను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పట్టుకున్నారు. వారి వద్ద నుండి 5 పందెం కోళ్ళు, రూ.32.960 రుపాయాల నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన పందెం రాయళ్ళ తిరుచానూరు పోలీసు స్టేషన్‌లో అప్పజెప్పినట్లు ఎస్ఇబి అధికారులు తెలిపారు.

## గంజాయి నుండి చంద్రగిరికి విముక్తి

ఇసుక అక్రమ రవాణా అడుగంటిన జలాలు ,టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి



**చంద్రగిరి, జనవరి 3 ప్రభాతవార్త:** యువతను పెడదోవ పట్టిస్తున్న గంజాయి మత్తు నుండి చంద్రగిరికి విముక్తి కల్పించడమే లక్ష్యంగా ప్రజలు సహకరించాలని టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని సతీమణి, టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి కోరారు. నరశింగాపురంలో బుధవారం ఆమె మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు గ్రామస్థులు, టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు.ఇసుక అక్రమ రవాణాను నిలువరించడం, ప్రజలకు న్యాయమైన ధరలకు ఇసుకను అందించడం టిడిపి ప్రభుత్వానికే సాధ్యమని ఆమె అన్నారు. ఇసుక అక్రమ రవాణాతో ఈ ప్రాంతంలో ఇప్పటికే 20 అడుగులు మేర నీటి మట్టం అడుగంటిపోయినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. అంతకుముందు టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కూర్ ధనంజయ రెడ్డి రూపొందించిన పులివర్తి నాని 2024 క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి అండగా తుడా చైర్మన్

**చంద్రగిరి, జనవరి 3 ప్రభాతవార్త:** చంద్రగిరి బైపాస్ రోడ్డుపై మంగళవారం టిప్పర్ ఢీకొని అశువులు బాసిన జగన్నాథం రెడ్డి కుటుంబానికి అండగా నిలిచిన తుడా చైర్మన్, చంద్రగిరి ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తక్షణ ఆర్థిక సాయంగా రూ.20 వేలు అందజేశారు. బుధవారం పోస్టుమార్టం పూర్తి చేసుకున్న భౌతికకాయాన్ని కొత్త శానంబట్లకు తీసుకువచ్చారు.

## దురాచారాలకు సావిత్రిబాయి పూలే స్వస్తి

**చంద్రగిరి, జనవరి 3 ప్రభాతవార్త:** అవిద్య, అంటరానితనం వంటి దురాచారాలకు స్వస్తి పలికిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్య కొనియాడారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.అనంతరం ఎంఈఓ శ్రీవరం లలితకుమారిని, టీచర్లను ఘనంగా సన్మానించారు. మహిళల పట్ల, విద్య పట్ల సామాజిక స్పృహతో వే ఫౌండేషన్ అందిస్తున్న సేవలకు ఎంఈఓ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 భాస్కర్‌బాబు, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా పెంచిన పెన్షన్ పంపిణీ

**నారాయణవనం, జనవరి 3 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెల నుంచి పెంచిన సామాజిక వైస్సాఆర్ పెన్షన్‌ను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం అందజేశారు. స్థానిక మండలకేంద్రంలోని తాతా సొరకాయులస్వామి కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానం మేరకు దశల వారిగా పెన్షన్‌ని పెంచుకుంటూ ప్రస్తుతం 3వేల రూపాయాలను అందిస్తున్నట్టు గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్ధాని ్న అమలు పరచడంలో ఆయనకు మించిన నాయకుడు లేదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర ఇ సొరకాయులు, మండల సచివాలయం కన్వీనర్ కోనేటి బాబు, డిసిసిబి డైరెక్టర్ ఊరప్ప, మండల వైస్ ఎంపిపి శివశంకర్, సోడా మణిరెడ్డి, ఎంపిడిఓ కృష్ణమూర్తి, తహశీల్దారు ప్రమీల, ఎపిఎం మమత, సర్పంచ్ కెజి శారదమ్మ గణేషన్, ఎంపిటిసి రాధ మోహన్, ఇఓపిఆర్‌డి డాక్టర్ వేణయ్య, ఇఓ షణ్ముగం, నాయకులు ఆర్‌డి ఏకాంబరం, అన్నాదొరై, కె సాయిరవికుమార్, గురుస్వామి, మనోహర్, ఢిల్లీ, సొరకాయులు, మురగేశం, రామమూర్తి, ధర్మలింగం, అయ్యప్ప శశికళ, ఆరుముగం, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే కొండలచెరువులో సర్పంచ్ భూపాల్‌రెడ్డి, కార్యదర్శి మునివాసులు పెంచిన పెన్షన్ కానుకతో పాటు సాధారణ పెన్షన్‌ని కూడా అందజేశారు.

## శ్రీకాళహస్తిలో ప్రారంభమైన సీనియర్ టెన్నిస్ పోటీలు

**శ్రీకాళహస్తి,జనవరి 3 ప్రభాతవార్త:**



శ్రీకాళహస్తి ఎస్‌డికె నగర్‌లోని విక్రమ్ స్టేడియంలో బుధవారం నిరాడంబరంగా జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు డాక్టర్ చంద్రశేఖర్ పర్యవేక్షణలో శ్రీకారం చుట్టారు. పది రోజులుగా కోర్టులను సిద్దం చేసారు. సీనియర్స్ పోటీలకు ఈ ఏడాది ఆతిధ్యం ఇచ్చారు. ఇక ఏడు రోజుల పాటు శ్రీకాళహస్తి లోని టెన్నిస్ అభిమానులకు పండగే పండగ.క్రీడలు, క్రీడాకారులకు నిలయమైన శ్రీకాళహస్తిలో నాటి రాజులు ఏర్పాటు చేసిన రిపబ్లిక్ క్లబ్ సుమారు 35 సంవత్సరాల పాటు జాతీయ అంతర్జాతీయస్థాయిలో టెన్నిస్ పోటీలను నిర్వహించారు. ఈ మేరకు విక్రమ్ టెన్నిస్ కోర్టును సిద్దం చేశారు.బుధవారం మధ్యాహ్నం పోటీలను జాతీయ స్థాయి సీనియర్ల టెన్నిస్ టోర్నమెంట్‌కు సుమారు 300 మంది క్రీడాకారులు ఎంట్రీ అయ్యారు. వారిని నమోదు చేసుకున్నారు. ఈ నెల 3 నుంచి 9 వరకు ఏడు రో జుల పాటు నిర్వహించే పోటీలకు ఆరు కోర్టులను సిద్దం చేసారు. ఈ నెల 5 నుంచి ప్రధానపోటీలు ప్రారంభం కానున్నట్లు డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు.

## అభివృద్ది కొరవడిన శ్రీకాళహస్తి నియోజకవర్గం..రిషితారెడ్డి

**శ్రీకాళహస్తి, జనవరి 3 ప్రభాతవార్త:**



అన్నపూర్ణగా ఖ్యాతిగడించిన రాష్ట్ర కీర్తికి మాయని మచ్చగా తయారైన వైసిపి మూకల ఆరాచక చర్యలతో రాష్ట్రంలో ఆడబిడ్డలకు రక్షణ లేకుండా జగన్‌రెడ్డి పాలనకు సమాధికట్టడానికి రాష్ట్రంలోని మహిళలు కంకరణబద్దులు కావాలని, నియోజకవర్గంలో అభివృద్ది కొరవడిందని తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం ద్వారా తెదేపా పార్టీ రాబోవు ఎన్నికల్లో విజయం సాధించి అధికారం చేపట్టిన తర్వాత అర్హులైన వారికి అందించబోయే విశిష్ట పథకాలను వివరించారు. మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని 22వ వార్డు ఎన్టీఆర్‌నగర్‌లో పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర సాంస్కృతిక విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరు సుబ్రమణ్యం, వార్డు నాయకులు పూలశేఖర్, చెంబేటిబాలయ్య, నున్నా అనూష, సులేమాన్, శివకుమార్, సుధాకర్, ప్రభ, రమేష్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జి.దశరధాచారి, వన్నెకులక్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్‌రవి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రేణుకాదేవి, తెలుగు మహిళా తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు చక్రాల.ఉష, జిలానీబాష, పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, డా.ఉమేష్‌రావు, ఎంఎస్.రెడ్డి, సరోజమ్మ, పార్వతీ, దుర్గ, మల్లిక, కనకాంబరం, సిద్దయ్య, రవి, శివయ్య, గణేష్, చిన్నా, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి అభివృద్దే మా ప్రధాన ధ్యేయం

**ఎమ్మెల్యే భూమన కరణాకర్ రెడ్డి**

**తిరుపతి కార్పొరేషన్, జనవరి 3 ప్రభాతవార్త**



తిరుపతి అభివృద్దే ధ్యేయంగా పని చేస్తామని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. బుధవారం తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నాలుగు ప్రాంతాల్లో పూర్తి చేసిన పనులను ఎమ్మెల్యే, కరుణాకర్ రెడ్డి, నగరపాలక సంస్ద మేయర్ శిరీష్‌లు ప్రారంభించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరం మరింత అభివృద్ది సాధించాలనే లక్ష్యంతో మునిసిపల్ కార్పొరేషన్ కౌన్సిల్, అధికారులు సహాయసహకారాలతో మరింత అభివృద్ది చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు, అనిల్ కుమార్, మునిరామిరెడ్డి, నరేంద్రనాద్, టౌన్ బ్యాంక్ ఛైర్మెన్, కేతం జయచంద్రారెడ్డి, ఎంఈఇ చంద్రశేర్, వెంకటరామిరెడ్డి, శంకర్ రెడ్డి, మునిశేఖర్ రెడ్డి, మార్కెట్ మునిరామిరెడ్డి, శేఖర్. గఫూర్ రవి, చింతా భరణి, రమేష్ రెడ్డి, రమేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు బిఆర్ఎస్ మద్దతు

**న్యాయపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలి**

**బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్**

**తిరుపతి టౌన్, జనవరి 3 ప్రభాతవార్త:**



తిరుపతిలోని అనంతవీధి కూడలిలో గల బిఆర్ఎస్ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడి కార్యకర్తలు వారికి రావాల్సిన న్యాయమైన కోరికలు కోసం గల నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని తెలిపారు. ఎన్నికల ముందు పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను వాగ్దానాన్ని పక్కన పెట్టి చోద్యం చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ తీరు ఇలాగే కొనసాగితే రానున్న ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అన్ని రాజకీయపార్టీలు అఖిలపక్షంగా ఏర్పడి ఉద్యమిస్తామని పేర్కొన్నారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ తరపున అంగన్‌వాడి కార్యకర్తలకు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు చెప్పారు.

## మద్యం మత్తులో నీటి సంపులో పడి వ్యక్తి మృతి

**తిరుపతి క్రైం, జనవరి 3 ప్రభాతవార్త**

మద్యం మత్తులో నీటి సంపులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం ఆటో నగర్‌లో ఉన్న అంకాలమ్మ గుడి సమీపంలో చోటు చేసుకుంది. మృతుడు స్థానిక వెల్డింగ్ షాపులో పనిచేసే జవ్వాది సత్యనారాయణ (25)గా పోలీసులు గుర్తించారు. కాకినాడ జిల్లా పెద్దాపురంకు చెందిన సత్యనారాయణ చైతన్యపురంలో నివాసం వుంటున్నాడు. మృతుడి అన్న దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు అలిపిరి ఎస్ఐ ఇమ్రాన్ భాష కేసు నమోదు చేసారు.

## లారీ ఢీకొని యువకుడు మృతి

**పుత్తూరురూరల్, జనవరి 3 ప్రభాతవార్త:**



లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన పుత్తూరు పట్టణ పరిధిలో బుధవారం సాయంత్రం జరిగింది. ఎస్ఐ వెంకట మోహన్ కథనం మేరకు వివరాలు... పుత్తూరు మండలం ఉత్తరపు కండ్రిగ దళితవాడకి చెందిన సుధాకర్‌కు దినకర్, దివాకర్ కవలల పిల్లలు. సుధాకర్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో దినకర్, దివాకర్ మరో మిత్రుడు కలసి కల్యాణపురం వైపు నడిచి వెళుతుండగా పుత్తూరు నుంచి కార్వేటినగరం వైపు వెళుతున్న లారీ ఢీకొంది. ఈ సంఘటనలో దినకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. మృతి చెందిన దినకర్ స్థానిక సాయిజ్యోతి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకులు

**వరదయ్యపాలెం, జనవరి 3 ప్రభాతవార్త**



వరదయ్యపాలెం యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో మండల విద్యా శాఖ కార్యాలయంలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతదేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే సేవలను స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు రాజమోహన్ బాబు, అధ్యక్షుడు శశికుమార్, ప్రధాన కార్యదర్శి సురేష్ భగవాన్, శాంత, రాధారాణి, వసంత, వెంకటమోహన్, వెంకునాయుడు, కొండలరావు, తిరుపతి నాయుడు, రాజు, నవీన్ కుమార్, రామారావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## మోసకారి జగన్‌కు తగిన బుద్ధి

**బంగారుపాళ్యం, జనవరి 3 ప్రభాతవార్త:**



మాయమాటలతో ప్రజలకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు తగిన బుద్ది చెప్పే సమయం ముందు వుందని పూతలపట్టు తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ డాక్టర్ మురళీమోహన్ అన్నారు. బుధవారం సాయంత్రం జయంతి గ్రామంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో వివిధ వర్గాల సంక్షేమం కోసం 730 హామీలను ప్రజలకు ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి నాలుగేళ్ళ 9 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని ఎద్దేవా చేశారు. 730 హామీల్లో 21 హామీలు మాత్రమే పూర్తిగా అమలు చేసి మిగిలిన 109 హామీలను పాక్షికంగా అమలులోకి తెచ్చారని చెప్పారు. మిగిలిన 620 హామీలను గాలికి వదిలారని ఆరోపించారు. ముఖ్యంగా మద్యపాన నిషేధం, సిపిఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సబ్‌ప్లాన్ అమలు తదితర సంక్షేమ హామీలను అమలు చేయలేని ఆరోపించారు. రైతు భరోసా 12,500 రూపాయలు ఇస్తామని చెప్పి కేవలం 7,500 రూపాయలు మాత్రమే ఇచ్చారన్నారు. డ్వాక్రా సంఘాల అభయహస్తం డబ్బులను దారి మళ్ళించారని ఆరోపించారు. అమ్మఒడిలో అందరికి విద్య అని చెప్పి కేవలం ఒక విద్యార్థికి మాత్రమే వర్తింపు అయ్యేలా చేశారన్నారు. ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన సిఎం వైఎస్ జగన్ 2024 ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదన్నారు. ప్రజలు సిఎం జగన్ మోసాలు గుర్తించి తెలుగుదేశంను బలపరచి చంద్రబాబునాయుడును సిఎంను చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల తెలుగుదేశం అధ్యక్ష, కార్యదర్శులు జయప్రకాష్, జనార్ధన్‌గౌడు, నాయకులు వంశీచౌదరి, దేవయాని, హేమచంద్రనాయుడు, రమేష్, గిరిబాబు, రవి, సుదర్శన్‌నాయుడు, బాల, ప్రసాద్, రఘుపతి, మణి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు విద్యావంతులైతేనే దేశం అభివృద్ధి

**తిరుపతి,జనవరి 3ప్రభాతవార్త:**



మహిళలు విద్యావంతులైతేనే దేశం అభివృద్ధి చెందుతుందని భావించిన మహాత్మాజ్యోతిరావుపూలే సతీమణి సావిత్రిబాయి పూలేను చదివించారని బిజెపి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్ తెలిపారు. ఆమె చదువును అభ్యసించి సాటి మహిళలకు విద్యను నేర్పించారన్నారు. ఆమె దేశంలో మొదటి మహిళ ఉపాధ్యాయురాలైందని వివరించారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం తిరుపతి తీర్థకట్టవీధిలోని నగరపాలక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాళ్ళు పుష్పలత, సునీతలను ఘనంగా సన్మానించారు. అనంతరం సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## క్షత్రియరాణుల ఐక్యవేదిక అధ్యక్షురాలుగా శ్రీదేవి

**తిరుపతి,జనవరి 3ప్రభాతవార్త:**



ఏడుకొండలస్వామి పాదాలచెంత తిరుపతిలో రాజు క్షత్రియరాణుల ఐక్యవేదిక నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. బుధ ్వారం ఉదయం రాయలసీమ రాజుల రాజకీయ చైతన్యవేదిక వ్యవస్థాపకుడు గుండ్రాజు సుకుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మహిళ క్షత్రియులతో ఐక్యవేదిక ఏర్పాటైంది. అధ్యక్షురాలిగా వైసిపి మహిళ నేత రుద్రరాజు శ్రీదేవి, కన్వీనర్‌గా వడమాలపేట మండలం ఏఎం పురంకు చెందిన టిడిపి నేత గుంటమడుగు వసంత,కో కన్వీనర్‌గా మంగళం తిరుమలనగర్‌కు చెందిన గుండ్రాజు లక్ష్మీదేవి, సభ్యులుగా మహారాజపురంకు చెందిన దాసరిరాజు మురలమ్మ, బాలయ్యపల్లిమండలం ఎన్‌సి కండ్రిగకు చెందిన దొమ్మరాజు ప్రశాంతి, రైల్వేకోడూరుకు చెందిన హస్తి లక్ష్మీదేవి,వెంకటగిరికి చెందిన దాసరాజు సుజాత నియమితులయ్యారు. భవిష్యత్తులో క్షత్రియరాజుల మహిళల కమిటీ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనుందని తెలిపారు.

## భగవన్నామ స్మరణతోనే మోక్షం

**-శ్రీవారి సేవలో సుగుణేంద్రతీర్థస్వామి**

**తిరుమల,జనవరి 3 ప్రభాతవార్తప్రతినిధి:**



ప్రజలు నిరంతరం భగవంతుని నామస్మరణతోనే మోక్షం కలుగుతుందని, కలియుగంలో ప్రతి ఒక్కరూ భగవంతుని సేవలో తరించాలని కర్నాటక ఉడిపి పుత్తిగమఠం పీఠాధిపతి సుగుణేంద్రతీర్థస్వామి ఉద్ఘాటించారు. బుధవారం ఉదయం శిష్యులతో కలసి తిరుమలకు చేరుకున్న స్వామివారికి టిటిడి డిప్యూటీ ఈఓ పి.హరాంధ్రనాథ్, ఆలయ అధికారులు ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. ధ్వజస్తంభం మొక్కిన సుగుణేంద్రతీర్థస్వామి సన్నిధిలో దేవదేవుడ్ని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి డిప్యూటీ ఈఓ పి.హరాంధ్రనాథ్ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మీ ఆదరణకు రుణడివుంటాం..!

**అర్హులందరికీ సంక్షేమ పథకాలు..**

**గడపగడపకు మనప్రభుత్వం**

**వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి**

**చంద్రగిరి, జనవరి 3 ప్రభాతవార్త:**



మా తండ్రిఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పట్ల మీరు చూపుతున్న ఆదరణకు జీవితకాలం మీకు రుణపడి వుంటామని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అన్నారు. స్థానిక కొత్తపేటలో బుధవారం ఆయన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి యువజన విభాగం, టీమ్ చేగు సంయుక్త ఆధ్వర్యంలో నాగాలమ్మ నుండి కొత్తపేట వరకు 300 మంది యువకులు భారీ బై క్ ర్యాలీ నిర్వహించి, తమ నాయకుడికి ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమం, ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేస్తున్న సేవలు, పంచాయతీలో జరిగిన అభివృద్ధి ప్రతికుటుంబంలోనూ ఆనందాన్ని నింపాయన్నారు. సమస్యలపై స్పందిస్తూ ముందుకు సాగిన ఆయన కరోనా సమయంలో తన తండ్రి అందించిన సేవలను మహిళలు కొనియాడటం పట్ల సంతృప్తిని వ్యక్తం చేశారు. యువకుడు, తండ్రి ఆశయాలను, సేవలను పునికిపుచ్చుకున్న మా అన్నయ్య తుడా చైర్మన్, ఎంఎల్ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని 2024 ఎన్నికలలో అక్కున చేర్చుకుని ఎంఎల్ఏగా ఆధరించాలని కోరారు. అంతకుముందు దాసరివీధిలో గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం ప్రారంభోత్సవంలో చంద్రగిరి సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి దంపతులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డిలను దుశ్శాలులు, గజమాలతో ఘనంగా సన్మానించారు.

## కుప్పం ఘటనపై అధిష్టానానికి నివేదిక

**షోకాజ్ నోటీస్ అంటూ తప్పుడు ప్రచారం**

**జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డా. పసుపులేటి హరిప్రసాద్**

**తిరుపతి టౌన్, జనవరి 3 ప్రభాతవార్త :**



కుప్పంలో జరిగిన ఘటనపై పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు నివేదిక నమర్పించామన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ బుధవారం ఆయన ఓ పత్రిక ప్రకటన విడుదల చేసారు. జనసేన పార్టీ అధిష్టానం తనకు షోకాజ్ నోటీసు ఇచ్చినట్టు కొందరు పనిగట్టుకొని మరీ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కుప్పంలో ఏం జరిగింది? అన్నదానిపై మూడు అంశాలపై నివేదికను మాత్రమే కేంద్ర కార్యాలయం అడిగిందని చెప్పారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జనసేన, టిడిపి పొత్తును జీర్ణించుకోలేక కొందరు పనిగట్టుకొని మరీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. మీడియాలో వార్త రాసే ముందు వివరణ కోరి ఉంటే బాగుండేదని ఆయన అభిప్రాయపడ్డారు.

## సమస్యలు పరిష్కరించి మీ పని చేసుకోండి

**- మున్సిపల్ పాలకవర్గంతో పారిశుధ్య కార్మికులు**

**సూళ్ళూరుపేట, జనవరి 3 ప్రభాతవార్త**



ముందుగా మా సమస్యలు పరిష్కరించండి. మేము అడిగిన జీతాల పెంపు, ఇతర సౌకర్యాలు పరిష్కరించి అనంతరం మీకు ఇష్టం వచ్చినట్లు చెత్త తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టాలని సూళ్లూరుపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు పాలకవర్గం ఆధ్వర్యంలో బాపూజీవీధిలో నిర్వహిస్తున్న చెత్త తొలగింపును అడ్డుకున్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షతన పట్టణంలో పారిశుధ్యం విషయమై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కనీసం ప్రధాన వీధుల్లో అయినా చెత్త తొలగింపు కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించి ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్, కౌన్సిలర్లు స్థానిక బాపూజీవీధికి రెండు ట్రాక్టర్లు తీసుకెళ్లారు. తక్షణమే సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికులు ట్రాక్టర్‌కు అడ్డుగా కూర్చొని గట్టిగా ఆందోళన చేపట్టారు. దీంతో పట్టణ వైసీపీ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్ మీజూరు రామకృష్ణారెడ్డి తదితరులు కార్మిక నాయకులతో వాగ్వివాదానికి దిగారు. పదిరోజులుగా దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నామని, మీ పాటికి మీరు సమ్మె చేసుకోండి మేము చెత్తను తొలగిస్తాం, మీరెందుకు అడ్డపడుతున్నారంటూ వాగ్వివాదానికి దిగారు. దీంతో మాకు సంబంధించిన వారిని ఈ కార్యక్రమంలో వినియోగించుకోకండి, మీరే చెత్తను ఎత్తుకోండి, అలా అయితే మేము అడ్డుకోబోమంటూ మున్సిపల్ పాలక వర్గానికి పారిశుధ్య కార్మికులు తెలిపారు. మున్సిపల్ కార్మికులు అడ్డు తొలగడంతో అనంతరం బాపూజీవీధిలో చెత్తతరలింపు కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు.

## ఇస్రో రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌కు పేట్రన్‌గా మన నారాయణ

**- హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరణ**

**- పలువురి ప్రశంసలు**

**శ్రీహరికోట (తడ), జనవరి 3 ప్రభాతవార్త**



శ్రీహరికోటలో సుదీర్ఘకాలం అంతరిక్ష శాస్త్రవేత్తగా పనిచేసిన సూళ్లూరుపేటకు చెందిన డాక్టర్ కాటూరి నారాయణ ఇస్రో రిటైర్డ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌కు పేట్రన్‌గా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో రిటైర్డ్ ఉద్యోగులు ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఇంతకుముందు ఎన్ఆర్ఇఎస్ డైరెక్టర్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన దీక్షితులు ఈ సంఘానికి సారధ్యం వహించారు. ఆయన ప్రస్తుతం కాటూరి నారాయణకు బాధ్యతలు అప్పగించారు. ఇస్రోలోని వివిధ కేంద్రాలతో పాటు షార్ డైరెక్టర్‌గా కాటూరి నారాయణ విశేష సేవలు అందించారు. ఆయనకు సూళ్లూరుపేట ప్రాంతంలోని పలువురు ఇస్రో ఉద్యోగులు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. రాకెట్ల తయారీ, వాటి ప్రయోగాలలో ఎంతో దిట్టగా పేరుపొందిన నారాయణ ఈ ప్రాంతంలో చిరపరిచితుడు. షార్ సమీప ప్రాంతాల్లో అంతరిక్ష శాస్త్రవేత్తగా అంత ఎత్తుకు ఎదిగిన మరొకరు లేరని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.

## కాణిపాకం ఆలయానికి రెండు లక్షలు విరాళం

**కాణిపాకం, జనవరి 3 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పథకాలకు ఓ భక్తుడు బుధవారం రెండు లక్షల రూపాయ లను విరాళంగా అందజేశారు. ఈమేరకు విజయవాడకు చెందిన షణ్ముఖ అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,51,116 రూపాయలను, సిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు 50,001 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తా_న్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విష్ణుష్, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## రూ.3వేల పెన్షన్ పంపిణీ పండుగ ప్రారంభం

**- కాకినాడ నుండి సిఎం వైఎస్ జగన్ శ్రీకారం**

**- జిల్లాలో కొత్తగా 3,937 మందికి పెన్షన్**

**- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుచిత్తూరు, జనవరి 3 ప్రభాతవార్త:**



జిల్లాలో 3 వేల రూపాయల సామాజిక పెన్షన్ పంపిణీ పండుగ బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్ర స్థాయిలో ఈ కార్యక్రమంను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కాకినాడ రంగరాయ వైద్య కళాశాల మైదానం నుండి ఈ కార్యక్రమంకు శ్రీకారం చుట్టగా జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, మేయర్ అముద, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో జనవరి నెల నుండి 2,76,008 మంది లబ్దిదారులు ఒకొక్కరికి 3 వేల రూపాయలు పెన్షన్ అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలో కొత్తగా 3,937 మంది లబ్దిదారులకు పెన్షన్లు మంజూరు అయ్యాయన్నారు. పెంచిన వైఎస్ఆర్ పెన్షన్ కానుకను అవ్వా, తాతలకు ప్రతి నెలా 1వ తేదీ ఉదయం 6 గంటలకు వాలంటీర్లు వెళ్ళి ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు జిల్లాకు సంబంధించి 2,76,008 మంది లబ్దిదారుల వైఎస్ఆర్ పెన్షన్ కానుక రూ.80.90 కోట్ల మెగా చెక్కును మేయర్ అముద, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ చేతుల మీదుగా లబ్దిదారులకు అందజేశారు. అలాగే వైఎస్ఆర్ పెన్షనల్ కానుక పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు.

## మహిళల విద్యకు సావిత్రిబాయి పూలే విశేష కృషి

**- ద్రవిడ వర్సిటీ వి.సి. ఆచార్య మధుజ్యోతి**

**కుప్పం, జనవరి 3 ప్రభాతవార్త**

దేశంలోనే తొలిసారి మహిళా విద్యకు సావిత్రిబాయి పూలే విశేష కృషి చేశారని ద్రవిడ వర్సిటీ వి.సి. ఆచార్య కొలకలూరి మధుజ్యోతి పేర్కొన్నారు. బుధవారం వర్సిటీలో సంఘ సంస్కర్త, దేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూజలు జరిపారు. అనంతరం ఉపకులపతి ఆచార్య మధుజ్యోతి మాట్లాడుతూ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. నిరుత్సాహ పడకుండా అనేకమంది మహిళలను విద్యావంతులుగా చేశారన్నారు. ఆమె కృషి ఫలితమే నేడు అనేకమంది మహిళలు ఉన్నత స్థాయిల్లో ఉన్నారన్నారు.

పూణేలో సావిత్రిబాయి స్మారకార్థం యూనివర్సిటీ సైతం ఏర్పాటైన్నారు. రెక్టార్ ఆచార్య అనురాధ మాట్లాడుతూ సావి త్రిబాయి తన భర్త మహాత్మా పూలే వద్ద చదుకుని మహిళలను విద్యావం తుల్ని చేయడంతో అకుంఠిత దీక్షతో పనిచేశారన్నారు. రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే




**తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి**

**ఈ సంస్థ యొక్క ఖాళీ గదులను మరియు ఆటోనగర్ నందు మొదటి అంతస్తును బహిరంగ వేలము తేది: 20.01.2024**

ఈ సంస్థ యొక్క 6 ఖాళీ గదులను మరియు ఆటోనగర్ నందు మొదటి అంతస్తును తేది: 20.01.2024న నెలసరి అద్దె (లీజ్) ప్రాతిపదికన కేటాయించుటకు బహిరంగ వేలము నిర్వహించబడును. వేలము నిర్వహణకు దరఖాస్తులు, ధరావతులు మరియు ఇతర వివరముల కొరకు ఈ కార్యాలయపు పని వేళలందు సంబంధిత సిబ్బందిని సంప్రదించవచ్చును.

సం/- యస్.హరికృష్ణ, యం.ఏ, యం.ఫిల్, ఉపాధ్యక్షులు, తుడా, తిరుపతి